ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి
20
మంగళవారం 22 ఆగస్టు 2017



మట్టి గణపయ్యలే మేలు

- పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి
- రంగుల విగ్రహాలు వాడొద్దు
- అడిషనల్ డీజీపీ తేజ్‌దీప్ కౌర్

5 లో



విద్యార్థులతో కలిసి మట్టి వినాయకుల ప్రాధాన్యాన్ని వివరిస్తున్న తేజ్‌దీప్ కౌర్



ముబారక్‌పూర్(బి) పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంఈవో అంజయ్య (ఫైల్)

- 26మండలాల్లో ఇద్దరే రెగ్యులర్ ఎంఈవోలు
- ఒక్కొక్కరికీ రెండు, మూడు మండలాలు అప్పగింత
- హెచ్‌ఎంలకూ అదనపు బాధ్యతలు
- రెండింటికీ న్యాయం చేయలేమని ఆవేదన
- కొరవడుతున్న జవాబుదారీతనం

4

విద్యాశాఖలో ఇన్‌చార్జీలే దిక్కు

జిల్లాలో మండల విద్యాశాఖ అధికారులు కరువయ్యారు. 26 మండలాలకు గాను కేవలం ఇద్దరే రెగ్యులర్ ఎంఈవోలుగా పని చేస్తున్నారు. మిగతా 24 మండలాలు ఇన్‌చార్జీల పాలనలోనే కొనసాగుతున్నాయి. దీంతో పాఠశాలల్లో పర్యవేక్షణ కొరవడుతోంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉండదని, కీలకమైన విద్యాశాఖలో మండల అధికారులను నియమించకపోతే ఎలాగని పలువురు ప్రశ్నిస్తున్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

టెక్నాలజీతో కేసుల పరిశోధన
మరింత సులువు

- సీసీటీఎన్ఎస్‌తో సేవలు మెరుగు
- పోలీసు అధికారుల శిక్షణలోఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

5 లో

పోలీసులకు సెలవులు రద్దు : డీజీపీ

‘ఈ-పాస్’ ఇక్కట్లు

- యంత్రాల్లో తలెత్తుతున్న సాంకేతిక లోపాలు
- సిగ్నల్స్ అందక వేలిముద్ర ప్రక్రియ జాప్యం
- గంటల తరబడి పడిగాపులు
- పనులు మానుకుని వస్తున్న లబ్ధిదారులు

5





ఖననానికీ కష్టమే..

చిరు జల్లులు కురిసినా ఆ గ్రామంలోని మట్టి రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. బురదలో అడుగుతీసి వేయాలంటే కూడా భయమే.. ఇక భారీ వర్షం కురిస్తే.. రోడ్లన్నీ బురదమయమే. ఈ పరిస్థితిల్లో ఓ వ్యక్తి మృతి చెందగా కుటుంబీకులు, బంధువులు ఖననానికి ఎంతో ఇబ్బంది పడ్డారు. భయం భయంగా బురదలోనే అడుగులో అడుగేస్తూ తంతును పూర్తి చేశారు. ఈ సంఘటన సోమవారం జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామంలో జరిగింది.

- జహీరాబాద్

ఇంటర్వ్యూ

హరితహారానికే ప్రాధాన్యం



• మొక్కల పరిరక్షణకు గ్రీన్ బ్రిగేడ్ కమిటీలు • ఎంపీడీవో జయలక్ష్మి

కంది : ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన హరిత హారం కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు మండల అభివృద్ధి అధికారిణి ఎస్పీ జయలక్ష్మి తెలిపారు. ఆంధ్రజ్యోతితో ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు.

హరితహార కార్యక్రమం కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

పచ్చదనానికి ప్రాధాన్యతనిస్తున్నాం. హరితహారం ద్వారా కంది, సంగారెడ్డి మండలాల్లో 70శాతం మొక్కలు నాటాం. వాటి పరిరక్షణ కోసం గ్రీన్ బ్రిగేడ్ కమిటీలను గ్రామాల వారీగా ఎంపిక చేశాం.

30శాతం మొక్కలు ఆలస్యంగా నాటేందుకు కారణాలు ఏమిటి?

ఇక మిగిలిన 30శాతం నాటే మొక్కల్లో ఈత మొక్కలు నాటాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. గ్రామాల్లో ఉన్న ప్రధాన రోడ్లకు ఇరువైపుల ఈత మొక్కలు నాటించాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం. వరుస వానల వల్ల ఈ కార్యక్రమం ఆలస్యమైంది. త్వరలోనే పూర్తి చేస్తాం. ముఖ్యంగా చెరువు గట్లపై మొక్కలు నాటేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాం.

గ్రీన్ బ్రిగేడ్ కమిటీ సభ్యుల ప్రధాన విధి ఏమిటి

మొక్కలను సంరక్షించేందుకు గ్రీన్‌బ్రిగేడ్ కమిటీసభ్యులు పని చేస్తారు. ఒక గ్రామానికి 50మంది సభ్యులతో కమిటీ కొనసాగుతుంది.

హరితహారంలో ఏ రకం మొక్కలు ఎక్కువగా నాటుతున్నారు ?

మూడో విడతలో రెండు మండలాల వారీగా లక్ష మొక్కలు నాటాలనేది లక్ష్యం . ఇందులో టేకు, జామ, ఖర్జురా, మెయిందీ, మామిడి వివిధ పూల మొక్కలు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాం. మున్సిపల్, పోలీసు, ఎక్సైజ్, జైలు, రెవెన్యూ, పాఠశాలలు, పంచాయతీ తదితర శాఖలకు కూడా మేము మొక్కలు సరఫరా చేశాం. గృహ ఉపయోగాల నిమిత్తం మామిడి మొక్కలను పంపిణీ చేశాం.

కల్యాణ వేంకటేశ్వరుడిని కొలిస్తే..

కోరికలు తీరినట్టే!

• యతిరాజు, పూజారి



కొండాపూర్ : మండల పరిధిలోని తేర్పోల్‌లో వెయ్యి సంవత్సరాల క్రితం ఆలయం నిర్మించిన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రత్యేకత ఉంది. ఇక్కడ కోరికలు కోరుకుంటే స్వామివారు ఇట్టే తీరుస్తాడని గ్రామస్థుల నమ్మకం. పూర్వం ఈ ఊరిలో బంగారు రథం ఉండేది. ద్రవిడ భాషలో రథాన్ని తేర్ అనే వారు అందువల్లనే ఈ ఊరికి తేర్పోల్ అనే పేరు వచ్చింది. ఇక మొగలుల పరిపాలనలో ఈ ఆలయం ధ్వంసమైంది. గ్రామస్థులంతా కలిసి ఆలయాన్ని పునర్ నిర్మించారు. ఏడు సంవత్సరాల నుంచి కల్యాణ వేంకటేశ్వర స్వామికి నిత్యపూజలు, సామూహిక వ్రతాలు సాగుతున్నాయి. ఆలయంలో గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు ప్రతి శనివారం, మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

బీసీ, ఓబీసీలకు అన్ని రంగాల్లో

ప్రాతినిధ్యం కల్పించాలి

• తాటిపల్లి పాండు, కేంద్ర, ప్రభుత్వ రంగ సంస్థల ఓబీసీ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు



కంది : రాష్ట్ర, దేశ జనాభాల్లో ఓబీసీ/బీసీలు 52శాతానికి పైగా ఉన్నారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో 20శాతం కూడా ప్రాతినిధ్యం లేదు. 5శాతం ఉన్న ఉన్నత కులాల 80శాతం ఆక్రమించాయి. స్వాతంత్ర్యం పొంది 70ఏళ్ల గడిచినా బీసీలు అనేక రంగాల్లో ఇంకా వెనుకబడి ఉండాల్సి వస్తోంది. జనాభా ప్రకారం చట్ట సభలైన అసెంబ్లీ, పార్లమెంట్లలో అన్ని స్థానిక సంస్థల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలి. ఎస్సీ, ఎస్టీల మాదిరిగా ఓబీసీ/బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు ఇవ్వాలి. నిరుద్యోగ బీసీలకు పరిశ్రమల ఏర్పాటుకు రూ.5కోట్ల వరకు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలి.

భూములకు ఉండాల్సిన రికార్డులివే!

సదాశివపేట : భూములు ఉన్న ప్రతి రైతు, పట్టాదారు తప్పనిసరిగా భూమి రికార్డుల గురించి తెలుసుకోవాలి. భూముల వివరాలు ఆయా రికార్డుల్లో నమోదై ఉండాలి. వ్యక్తిగత హక్కు పత్రాలు ఉండి, భూమి స్వాధీనంలో ఉన్నప్పుడు మాత్రమే భూమిపై హక్కుకు పూర్తి భద్రత ఉంటుంది.



ఆయా భూములకు సంబంధించి రెవెన్యూ కార్యాలయాల్లో ఉండే రికార్డులివే

భూమి రకం	సంక్రమించిన విధానం	ఉండవలసిన రికార్డులు
1. పట్టాభూమి	కొనుగోలు	సేత్వార్ లేదా ఆర్ఎస్ఆర్, ఎఫ్ఎంబీ లేదా టిప్పన్ (సబ్ డివిజన్ ఉన్నప్పుడు మాత్రమే) గ్రామ లెక్క నెం-2, ఆర్ఓఆర్ ఫారం-1, 1బీ రిజిష్టర్, గ్రామ లెక్క నెం-3, గ్రామ లెక్క నెం-4 రిజిష్టర్డ్ సేల్ డీడ్, ఫారం 13బీ సర్టిఫికెట్, (తెల్ల కాగితంపై కొనుగోలు చేసినట్లయితే).
2. పట్టాభూమి	అసైన్‌మెంట్	పట్టాభూమి అసైన్డ్ చేసే అవకాశం లేదు.
3. పట్టాభూమి	ఆక్రమణ	ఆక్రమణ చేస్తే కేసవుతుంది.
4. పట్టాభూమి	కౌలు	గ్రామ లెక్క-2, ఆర్ఓఆర్ ఫారం-1, 1బీ రిజిష్టరు, గ్రామ లెక్క-3, 38ఈ సర్టిఫికెట్, (రక్షిత కౌలుదారు సర్టిఫికెట్), పట్టాదారుపాసు పుస్తకం.
5. పట్టాభూమి	కుదువ-తనఖా	గ్రామ లెక్క-2, ఆర్ఓఆర్ ఫారం-1, 1బీ రిజిష్టరు గ్రామ లెక్క-3, పట్టాదారు పాసుపుస్తకం.
6. ప్రభుత్వ భూమి	అసైన్‌మెంట్	గ్రామ లెక్క-1, గ్రామ లెక్క-2, గ్రామ లెక్క-3, గ్రామ లెక్క-4, సేత్వార్ లేదా ఆర్ఎస్ఆర్ ఎఫ్ఎంబీ లేదా టిప్పన్, (సబ్ డివిజన్‌ఉన్నప్పుడుమాత్రమే), 1బి రిజిష్టర్, పీపీబీ, టీడీ అసైన్డ్‌మెంట్ రిజిష్టరు, అసైన్డ్ పట్టా.
7. ప్రభుత్వ భూమి	ఆక్రమణ	గ్రామ లెక్క-4సీ, గ్రామ లెక్క-3.
8. ఈనాం భూములు	పట్టాపొందిన ఈనాం భూములు	గ్రామ లెక్క-2, ఆర్ఓఆర్‌ఫారం-1, గ్రామ లెక్క-3, గ్రామ లెక్క-4, ఓఆర్సీ సర్టిఫికెట్, సేత్వార్, ఎఫ్ఎంబీ, టిప్పన్ (సబ్ డివిజన్ ఉన్నపుడు మాత్రమే), పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్.
9. ఈనాం భూములు	పట్టా పొందని ఈనాం భూములు	గ్రామ లెక్క-3, ఈనాం ఫెయిర్ రిజిష్టర్.
10. సీలింగ్ భూములు	వారసత్వం	కుదరదు.
11. సీలింగ్ భూములు	ఆక్రమణ	ప్రభుత్వభూమి ఆక్రమణ పరిధిలోకి వస్తాయి.
12. అటవీ భూములు	2005 డిసెంబర్ 13 ముందు ఆక్రమణ	ఎఫ్ఆర్సీ రిజిష్టర్, అటవీ హక్కుల రిజిష్టరు, అటవీ హక్కు పత్రం.
13. అటవీ భూములు	2005 డిసెంబర్ 13 తరువాత ఆక్రమణ	అటవీ చట్టం 1986 ప్రకారం అటవీభూమి ఆక్రమణ నేరం.
14. దేవాదాయ భూములు	కౌలు	ఎండోమెంట్ రిజిష్టర్, గ్రామ లెక్క-3.
15. దేవాదాయ భూములు	కొనుగోలు	ఈ భూముల కొనుగోలు హైకోర్టు అనుమతితో జరగాలి. కొనుగోలు చేశాక ఇవి పట్టా భూములుగా మారుతాయి. పట్టా భూముల రిజిష్టరులో ఈ వివరాలు నమోదు చేస్తారు.
16. దేవాదాయ భూములు	ఆక్రమణ	ఆక్రమిస్తే కేసవుతుంది.
17. పట్టాభూమి	వారసత్వం	సేత్వార్ లేదా ఆర్ఎస్ఆర్, ఎఫ్ఎంబీ లేదా టిప్పన్ (సబ్ డివిజన్ ఉన్నప్పుడు మాత్రమే) గ్రామ లెక్క-2, ఆర్ఓఆర్ ఫారం-1, 1బి రిజిష్టరు, గ్రామ లెక్క-3, గ్రామ లెక్క-4, గ్రామ లెక్క-9, పీపీబీ లేదా టీడీ.
18. పట్టాభూమి	స్త్రీ ధనం-పసుపు కుంకుమ	సేత్వార్ లేదా ఆర్ఎస్ఆర్, ఎఫ్ఎంబీ లేదా టిప్పన్ (సబ్ డివిజన్ ఉన్నప్పుడు మాత్రమే గ్రామ లెక్క-2, ఆర్ఓఆర్ఆర్ ఫారం-1, 1బి రిజిష్టరు, గ్రామ లెక్క-3, గ్రామ లెక్క-4, గ్రామ లెక్క-9, పట్టాదారు పాసుపుస్తకం.
19. పట్టాభూమి	దానం	సేత్వార్ లేదా ఆర్ఎస్ఆర్, ఎఫ్ఎంబీ లేదా టిప్పన్ (సబ్ డివిజన్ ఉన్నప్పుడు మాత్రమే) గ్రామ లెక్క-2, ఆర్ఓఆర్ ఫారం-1, 1బి రిజిష్టరు, గ్రామ లెక్క-3, గ్రామ లెక్క-4, గ్రామ లెక్క-9, రిజిష్టరు దాన పట్టా, పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్.



అద్దెభవనంలో కొనసాగుతున్న పీజీ కళాశాల

నిధులున్నా నిష్ప్రయోజనం

- పీజీ కాలేజీకి స్థలం కేటాయించడంలో అధికారుల జాప్యం
- అద్దె భవనంలోనే తరగతుల నిర్వహణ

నర్సాపూర్: నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌లో కొనసాగుతున్న ఉస్మానియా యూని వర్సిటీ పీజీ కాలేజీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా స్థలం కేటాయించడంలో స్థానిక అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు కూడా పట్టించు కోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నర్సాపూర్ పీజీ కాలేజీలో ఎంబీఏ, ఏంసీజే, ఎంఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ ఆర్గానిక్ కోర్సులు ఉన్నాయి. కళాశాల రెండు సంవత్సరాల క్రితం మంజురు కాగా తాత్కాలికంగా అద్దె భవనంలో అరకొర సౌకార్యాల నడుమ కొనసా గుతోంది. స్థలం కేటాయిస్తే వెంటనే భవనం నిర్మించ డానికి యూనివర్సిటీ నుంచి నిధులు కూడా మంజూ రు చేశారు. ఈ కాలేజీ కోసం 20 ఎకరాల స్థలం అవ సరముంది. అయితే 50 ఎకరాల స్థలం కేటాయిస్తే భవిష్యత్తులో మరిన్ని కోర్సులు కూడా మంజూరై ప్రత్యేక యూనివర్సిటీగా ఏర్పాటు చేసే అవకా శముంది. అయితే పీజీ కాలేజీ కోసం స్థలం కేటా యించాలని కాలేజీ తరుపున స్థానిక అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా కాలయాపన చేస్తున్నారే తప్ప స్థలం కేటాయించడంలేదు.

ఆలయభూమి కేటాయించడం సాధ్యమేనా

కళాశాల కోసం నర్సాపూర్-మెదక్ ప్రధాన రోడ్డు పక్కన ఉన్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయానికి చెందిన భూమిని కేటాయించడానికి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రయత్నిన్నట్లు ప్రచారం. అయితే ఆలయ భూమిని ఇతర అవసరాలకు కేటాయించడానికి దేవదాయ శాఖ అనుమతివ్వడం సులుభం కాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కేవలం కాలయాపన కోసం ఆలయ భూమిని కేటాయిస్తున్నామని చెబుతున్నారని చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ భూమిని కళాశాల కోసం కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు. ఇంకా కాలయాపన చేస్తే మంజూరయిన నిధులు తిరిగి వెళ్తాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



నీరు, ఆకాశం ఒక్కటైనట్లు...

నారాయణఖేడ్: మంజీరా నదిలోని నీళ్లు, ఆకాశం ఒక్కటైనట్లుగా కనిపించడంతో సోమవారం ఉదయం ప్రజలు మనూరు మండలం రాయిపల్లి వద్ద ఆసక్తితో తిలకించారు. కాగా ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది.

కార్మికుల సమస్యలు పట్టవా?

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజయ్య

సంగారెడ్డి రూరల్: "భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పట్టవా" అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వేల సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పనిచేస్తున్నారని, కానీ వారి అడ్డాల వద్ద కనీసం తాగునీటి, మురుగు దొడ్లు సౌకర్యాలు కూడా లేవన్నారు. కార్మికుల సంక్షేమ బోర్డులో చెల్లించిన డబ్బు ఇతర సంక్షేమ పథకాల కోసం వెచ్చిస్తున్నారని ఆయన ఆరోపించారు. వెంటనే భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్క రించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి యాదవ రెడ్డి, నాయకులు మహబూబ్‌ఖాన్, ఖయూమ్ తదిత రులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఉపాధి కూలీ డబ్బు చెల్లించాలని ధర్నా

సంగారెడ్డి రూరల్: ఉపాధి కూలీలకు 15 వారాలగా కూలీ డబ్బు చెల్లించలేదని, కూలీలందరికి బకాయి డబ్బులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిలు డిమాండ్ చేశారు. సోమ వారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట వ్యకాస, సీఐటీయూ అద్వర్యంలో ధర్నా చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు బకాయి డబ్బులు చెల్లించకపోవడంతో వారి కుటుం బాలు పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కూలీలకు బకాయి డబ్బు చెల్లించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో జయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఖాజా, మల్లేశం, నర్సింలు, సుమతి, మాణమ్మ, ఏసుమని, ప్రమీల, శ్యామల, సుగుణమ్మ, లక్ష్మి, భాగ్య, వీరమణి తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఐకేపీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- వేతనంతో కూడిన ప్రసూతి సెలవులివ్వాలి
- ఆ సంఘం అధ్యక్షురాలు కవిత

సంగారెడ్డి రూరల్: డీఆర్డీఏలో విధులు నిర్వహి స్తున్న సెర్ప్ ఐకేపీ ఉద్యోగులు అకౌంటెంట్లు, అపరేట ర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం అధ్యక్షు రాలు కవిత డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమకు కనీస వేతనాలు రూ.18వేలు చెల్లించాలని, హెల్త్ కార్డులు ఇచ్చి ఆరోగ్య భద్రత కల్పించాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు తాము ఎదుర్కొంటున్న సమ స్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో శోభన, పద్మ, మహేశ్, కల్పన, మంజుల, స్వరాజ్, లావణ్య, శేఖర్, బాగ్యరాశి తదిత రులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

'పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి'

సంగారెడ్డి రూరల్: కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సాయిలు డిమాండ్ చేశారు. కంది మండల కేంద్రంలో సోమవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాయు కాలుష్యం వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని, పంటలు నష్టపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని ఆయన అన్నారు. ప్రభుత్వం కాలుష్యాన్ని అరికట్టి రైతులకు న్యాయం చేయా లని డిమాండ్ చేశారు. 23న పటాన్‌చెరులో నిర్వహించనున్న జిల్లా సదస్సును విజయవంతం చేయా లని కోరారు. కార్యక్రమంలో ఖాజా, మధు, భిక్షపతి తదిత రుల పాల్గొన్నారు.

కందిలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు



ప్రజ్ఞాపూర్ ఏపీజీవీబీ ఎదుట రైతుల ధర్నా

- రైతుల ధర్నాకు సంఘీభావం తెలిపిన కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ


ధర్నా చేస్తున్న రైతులు, వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌అర్బన్: గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు ఎదుట జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన దాదాపు వందమందికి పైగా రైతులు సోమవారం ధర్నా చేపట్టారు. 2014-15లో రాష్ట్రప్రభుత్వం రీషెడ్యూల్ చేసిన రుణాలకు సంబంధించిన తాకీదు (నోటీసు)లు బ్యాంకు అధికారులు రైతులకు అందిం చడంపై ధర్నాకు దిగారు. రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం రుణమాఫీలో భాగంగా తమ రుణాలకు రీషెడ్యూల్ చేసినా బ్యాంకులనుంచి నోటీసులు ఇవ్వడంపై మండిపడ్డారు. బ్యాంకు అధికారులు తమ రుణాలకు వడ్డీతో కలపి నోటీసులు అందించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ధర్నాకు తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కప్పెర భానుప్రకాశ్‌రావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భట్టు దయానందరెడ్డి, నాయకులు చారీ, రఘుపతి రెడ్డి, మథీన్, శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, హనుమంతరెడ్డి సంఘీభావం తెలిపారు. రైతులు ధర్నా చేపట్టిన విషయం తెలుసుకున్న గజ్వేల్ ఎస్ఐలు కమలాకర్, ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని రైతులను ఒప్పించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ తమకు స్పష్టమైన హామీ వచ్చే వరకు బ్యాంకు ఎదుట నుంచి కదిలే సమస్యే లేదని రైతులు భీష్మించుకూర్చున్నారు. ఈ క్రమంలో ఎస్ఐ కమలాకర్ జిల్లా వ్యవసాయాధికారి శ్రావణ్‌కుమార్‌తో ఫోన్లో మాటా ్డారు. 15 రోజుల్లో రీషెడ్యూల్ చేసిన రుణాలను వడ్డీతో సహా ప్రభుత్వం చెల్లింస్తుందని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు.

విద్యాశాఖలో ఇన్‌చార్జీలే దిక్కు

- 26 మండలాల్లో ఇద్దరే రెగ్యులర్ ఎంఈవోలు
- ఒక్కొక్కరికి రెండు, మూడు మండలాలు
- హెచ్‌ఎంలకూ అదనపు బాధ్యతలు
- రెండింటికీ న్యాయం చేయలేమని ఆవేదన


ముబారక్‌పూర్(బీ) పాఠశాలలో విద్యార్థిని సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జీ ఎంఈవో అంజయ్య(ఫైల్)

సంగారెడ్డి అర్బన్: జిల్లాలో 1,250 ప్రాథమిక, 199 ప్రాథమికోన్నత, 203 ఉన్నత పాఠశాలున్నాయి. సుమారుగా 2,19,575 మంది విద్యార్థులు ఆయా పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. జిల్లాలో ఇన్‌చార్జి ఎంఈవోల పాలనలో జవాబుదారీతనం కొరవడుతుంది. ఎంఈవోల బాధ్యత తాత్కాలికం కావడంతో అధికారులు తేలిగ్గా తీసుకుంటున్నారు. పనిచేసే పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెప్పలేక పాఠశాల స్థితిగతులపై దృష్టి పెట్టే బాధ్యతలు నిర్వహించలేక వారు సతమతమవుతున్నారు. ఇన్‌చార్జి ఎంఈవోలు ద్విపాత్రాభినయంతో ఇబ్బందిపడుతున్నారు.

ఎంఈవోల బాధ్యతలివిగో...

మండల స్థాయిలోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవోలు పర్యవేక్షిస్తారు. ఏటా విద్యా సంవత్సరం ఆరంభంలోనే మండలాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహించాలి. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా.. ఉపాధ్యాయుల విధులను పర్యవేక్షించాలి. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహిస్తూ విద్యార్థుల ప్రగతి, చదువులో వెనుకబడిన వారి సంఖ్యను సమీక్షించాలి. ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించే గురుతర బాధ్యత కూడా ఎంఈవోలదే. మండల స్థాయిలో విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించేలా చూడాల్సి ఉంటుంది. ఏటా విద్యా సంవత్సరం ఆరంభంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీతో పాటు మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల వేతన బిల్లులు, మధ్యాహ్నభోజన బిల్లులను తయారుచేసి వారికి చెల్లించే బాధ్యత కూడా వారిపైనే ఉంటుంది. ఉన్నతాధికారులు తనిఖీలు, పరిశీలనల్లో ఎంఈవోలే జవాబుదారీగా ఉండాలి. పాఠశాలల సందర్శన, రిజిస్ట్రర్లు, రికార్డుల పరిశీలన, ప్రొటోకాల్ విధులు తదితర కార్యక్రమాలు ఎంఈవోలు నిర్వహించాల్సి ఉంటుంది.

24 మండలాల్లో ఇన్‌చార్జిలదే పాలన

జిల్లాలో రెండు మండలాల మినహా మిగతా 24 మండలాలు ఇన్‌చార్జి పాలనలో కొనసాగుతున్నాయి. జిల్లాలోని కంగ్టి, జిన్నారం మండలాలకే రెగ్యులర్ ఎంఈవోలు ఉన్నారు. మిగతా 24 మండలాలకు ఆయా మండలాలోని సీనియర్ ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జి ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎంఈవోలకు పనుల ఒత్తిడితో తీరిక లేకపోవడంతో హెచ్‌ఎంలుగా నిర్వహించాల్సిన పాఠశాలల్లో సీనియర్ అసిస్టెంట్లపై పనిభారం పడుతుంది.

సిలబస్ పూర్తికాక ఇబ్బందులు

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఇన్‌చార్జి ఎంఈవోలు విద్యార్థులకు పాఠాలు బోధించలేకపోతున్నారు. దీంతో సకాలంలో సిలబస్ పూర్తికాక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. వారు పనిచేసే పాఠశాలల్లో ఇన్‌చార్జి ఎంఈవోల బదులు స్కూల్ అసిస్టెంట్లు, సీనియర్ ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతోంది. ఏటా ఫిబ్రవరి వరకే పూర్తి కావాల్సిన మార్చి వచ్చినా కొనసాగుతున్నది. దీంతో విద్యార్థులు గందరగోళ పరిస్థితుల్లోనే వార్షిక పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలి

జిల్లాలో రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలని పలువురు కోరుతున్నారు. విద్యారంగంలో ఇన్‌చార్జిలతో కొనసాగుతున్న పాలనను గుర్తించి రెగ్యులర్ ఎంఈవో నియామకానికి చర్యలు చేపటాలని అటు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇన్‌చార్జి ఎంఈవోలు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం



జిల్లాలో ఎంఈవోల కొరతపై ప్రభుతానికి నివేదించాం. రెండు తప్ప మిగతా 24 మండలాల్లో ఇన్‌చార్జిల పాలనే కొనసాగుతున్న మాటవాస్తవమే. ప్రభుత్వం త్వరితగతిన రెగ్యులర్ ఎంఈవోలను నియమిస్తే జవాబుదారీతనం, పారదర్శకంగా బోధన అందే అవకాశముంది.

- విజయకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి

శాఖలు నాలుగు.. అధికారి ఒకరే!

జిల్లాల పునర్విభజనతో కీలక శాఖలు ఖాళీ

పంచాయతీ అధికారికే ఇన్‌చార్జి బాధ్యతలు

నాలుగు శాఖలను పర్యవేక్షిస్తున్న వెంకటేశ్వర్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి)

జిల్లాలో కీలకమైన నాలుగు శాఖల బాధ్యతలూ ఒకే అధికారి నిర్వహిస్తున్నారు. జిల్లాల విభజన తర్వాత దాదాపు అన్ని శాఖలు సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్నాయి. దీనికి తోడు ముఖ్యమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో ఒక్కో శాఖకు ఒక్కో అధికారి ఉండాలి. అయితే గతేడాది జిల్లాల విభజన సందర్భంగా పదోన్నతిపై జిల్లా పంచాయతీ అధికారిగా నియమితులైన వి.వేంకటేశ్వర్లు ఇప్పుడు జిల్లా పాలన యంత్రాంగంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్ డివిజనల్ పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై గతేడాది అక్టోబరులో జిల్లా పంచాయతీ అధికారిగా వచ్చారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పంచాయతీల నిర్వహణ తదితర అంశాలను ఆయనే పర్యవేక్షిస్తారు. జిల్లాల విభజనతో జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ స్థానం ఖాళీ అయింది. గృహ నిర్మాణ సంస్థ సిబ్బందిని ఇతర శాఖలకు బదిలీ చేసిన ప్రభుత్వం ఆ శాఖను దాదాపుగా మూసేసే స్థితికి తెచ్చింది. గృహనిర్మాణ సంస్థ గతంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించడం, డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను సమన్వయ పరిచే కార్యక్రమాలను చేపట్టే అధికారి స్థానం ఖాళీగా ఉంది. దీంతో ఆ బాధ్యతనూ వెంకటేశ్వర్లు చూస్తున్నారు. జిల్లా పాలన సాఫీగా సాగుతున్న సమయంలో మార్చిలో ముఖ్యమైన డీఆర్‌డీఏ, డ్వామా శాఖల ఇన్‌చార్జి బాధ్యతలను జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లుకే అప్పగించాల్సి వచ్చింది.

డీఆర్డీవో బాధ్యతలూ...

జిల్లాల విభజన సందర్భంగా డీఆర్డీఏ, డ్వామా శాఖలను ప్రభుత్వం అక్టోబరులో విలీనం చేసింది. ఈ రెండు శాఖలు గ్రామీణాభివృద్ధికి సంబంధించినవి కావడంతో మార్చిలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖగా ఏర్పాటు చేసింది. ఈ శాఖ అధికారిని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్డీవో)గా పేర్కొంటున్నారు. జిల్లాలో డీఆర్డీవోగా పని చేస్తున్న అరుణ ఫిబ్రవరిలో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. మార్చి నుంచి డీఆర్డీవోగా వెంకటేశ్వర్లు పూర్తి బాధ్యతలు చేపట్టారు. జిల్లాలోని ఆసరా పింఛన్లు, స్వయం సహాయ సంఘాలకు బ్యాంకు రుణాలు, పల్లె ప్రగతి, ధాన్యం కొనుగోళ్లు, ఉద్యోగాల కల్పన తదితర కార్యక్రమాలను కూడా ఆయన చూస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతోపాటు స్వచ్ఛభారత్, నిర్మల్ భారత్ అభి యాన్, హరితహారం కార్యక్రమాలను కూడా ఆయనే పర్యవేక్షిస్తున్నారు. ఇలా ప్రధానమైన శాఖలను వి.వెంక టేశ్వర్లు చూస్తుండడంతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తర్వాత ఇద్దరు ముగ్గురు అధికారుల్లో ఇప్పుడు ఆయన ఒకరుగా ఉన్నారు.


జిల్లా పంచాయతీ అధికారి వి. వెంకటేశ్వర్లు

పంచాయతీ కార్యదర్శులపై కేసులను ఉపసంహరించాలి

- మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం

సంగారెడ్డి రూరల్: అమీన్‌పూర్‌లో గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులపై నమోదు చేసిన క్రిమినల్ కేసును నిలిపివేయాలని తెలంగాణ పంచాయతి కార్యదర్శుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ హైదరాబాద్‌లో భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, కార్యదర్శి మట్టయ్య, కోశాధికారి రాజలింగం, సభ్యులు హరిశంకర్, సంజయ్, రిజ్వాన్, సువర్ణ, ఈవోపీఆర్డీ సంధ్య, సుమతి, సుజాతా నాయక్, కార్యదర్శులు పద్మ, శారద, వాణి, సంగీత, నందీశ్వర్, యాదగిరి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో డీఈవో తనిఖీ

- బోధన, భోజనంపై సంతృప్తి వ్యక్తంచేసిన విజయకుమారి

కంది: కాశీపూర్ గ్రామంలోని కస్తూర్బా విద్యాలయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని బోధనా విధానాన్ని ఆమె పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వివిధ సౌకర్యాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు కలెక్టర్ బహుకరించిన టీవీని ఆమె ప్రారంభించారు. అలాగే విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను కూడా బహుకరించారు. అనంతరం డీఈవో విజయకుమారి విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. టీవీని బహుకరించిన కలెక్టర్‌కు విద్యార్థులు, అక్కడి సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కస్తూర్బా విద్యాలయం ప్రత్యేక అధికారి కవిత, సిబ్బంది అలియా సుల్తానా, మంజులావాణి, యాస్మిన్‌ఫాతిమా, రఫియా సుల్తానా, జైబున్నిసాబేగం, మన్నె మంజుల, సీత, సఫ్దరాకన్నమ్, నౌసిన్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్లేట్లను బహూకరిస్తున్న డీఈవో విజయకుమారి

జిల్లా బీసీ అభివృద్ధి అధికారిగా కేశురాం?

- ఆదిలాబాద్‌కు ప్రస్తుత అధికారి ఆశన్న బదిలీ

సంగారెడ్డి అర్బన్: జిల్లా బీసీ అభివృద్ధి అధికారిగా కేశురాంను నియమించినట్టు తెలిసింది. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో సహాయ వెనుకబడిన తరగతుల అధికారిగా ఆయన విధులు నిర్వహించారు. కాగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న బీసీ అభివృద్ధి అధికారి జి.ఆశన్న అదిలాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్తున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. రెండు, మూడు రోజుల్లో కేశురాం బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

సాఫీగా రుబెల్లా టీకా పంపిణీ

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మోజీరాం రాథోడ్


టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌వో మోజీరాం

సంగారెడ్డి అర్బన్: జిల్లాలో మీజిల్స్ రుబెల్లా టీకా పంపిణీ కార్యక్రమం సాఫీగా సాగుతోందని డీఎంహెచ్‌వో మోజీరాం రాథోడ్ తెలిపారు. సోమవారం సంగారెడ్డిలోని బ్రిలియంట్ హై స్కూల్, శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్, కరుణ హైస్కూల్ పాఠశాలలను సందర్శించి వ్యాక్సిన్ పంపిణీ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9నెలల నుంచి 15ఏళ్ల లోపు పిల్లలకు వ్యాక్సిన్‌ను పంపిణీ చేస్తునట్టు చెప్పారు. దీంతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో వంద శాతం టీకా పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

తట్టు వ్యాధిని అరికడదాం

తట్టు వ్యాధిని అరికట్టేందుకు అందరూ సహకరించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సరళ కుమారి అన్నారు. సోమవారం సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాల విద్యార్థులకు ఆమె స్వయంగా టీకా వేశారు. ఈ సందర్భంగా సరళకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 1,15,703 మంది విద్యార్థులకు టీకాలు వెసినట్టు చెప్పారు. కార్యక్రమంలో కమ్యునిటీ ఆర్గనైజర్ ఉదయశ్రీ, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

పోలీసులకు సెలవులు రద్దు

- పండుగల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి
- పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ అనురాగ్ శర్మ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పాల్గొన్న ఎస్పీ, అధికారులు

సంగారెడ్డి రూరల్: వినాయక చవితి, బక్రీద్ రెండు పండగలు ఒకేసారి వస్తున్నందున పోలీసు అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు చేయాలని డీజీపీ అనురాగ్ శర్మ ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డిని ఆదేశించారు. హైదరాబాద్ నుంచి డీజీపీ అనురాగ్ శర్మ సోమవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వినాయక చవితి, బక్రీద్ పండగలు సందర్భంగా జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టులు, పికెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్ ముమ్మరం చేసి బీట్ డ్యూటీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రతి అధికారీ అప్రమత్తంగా ఉంటూ ప్రజలు పండగలను శాంతియుత వాతావరణంలో జరుపుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పండగలను దృష్టిలో పెట్టుకుని జిల్లావ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి, బక్రీద్ పండుగల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో డీఎస్పీలు తిరుపతన్న, నల్లమల రవి, సీతారామ్, యాదగిరిరాజు, ట్రాఫిక్ సీఐలు సంజయ్‌కుమార్, శ్రీనివాస్ నాయుడు, ఎస్‌బీ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌బీ ఎస్ఐ దశరథ్, సబ్ డివిజన్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

టెక్నాలజీతో కేసుల పరిశోధన

మరింత సులువు

- జిల్లా ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అధికారులకు శిక్షణ

సంగారెడ్డి రూరల్: నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కేసులను సులువుగా పరిశోధించవచ్చని జిల్లా ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డిలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని పోలీసు అధికారులు, స్టేషన్ రైటర్లు కొత్త పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. దీంతో కేసులను సులువుగా చేధించవచ్చన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన పద్ధతిలో అవలంబిస్తూ తక్కువ సమయంలో కేసుల పరిశోధన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానాన్ని, వాటితో కలిగే ఉపయోగాలపై క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ కార్యక్రమంతో సామాన్య ప్రజలకు పోలీసుల సేవలు త్వరితగతిన అందించడమే కాకుండా నేరస్థుల సమాచారాన్ని ఒక మీట నొక్కడంతో తెలుసుకునే అవకాశాలున్నాయని చంద్రశేఖర్‌రెడ్డి వివరించారు. భవిష్యత్తులో ఉన్నతాధికారులందరూ నేర సమీక్షలు కంప్యూటర్, ట్యాబ్‌లతోనే నిర్వహిస్తారని, రాత పూర్వకంగా నివేదికలు ఉండవన్నారు. ప్రతి పోలీసు అధికారి దానికి తగ్గట్టు సన్నద్ధమవ్వాలని, అందుకు ప్రత్యేక కృషి చేయాల్సిన అవసరముందన్నారు. శిక్షణలో క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్ (సీసీటిఎన్ఎస్) ప్రాజెక్టులోని ఎంటర్‌ప్రైస్ ఈ కాప్స్ అప్లికేషన్, జైల్ రిలీజ్ మానిటరింగ్ సిస్టం (జేఆర్ఎంఎస్), కాల్ డేటా అనాలసిస్ టూల్ (సిడాట్), మిస్సింగ్ కేసుల గురించి గుర్తుతెలియని మృతదేహాలు గురించి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఎలా పొందుపరచాలి అనే అంశాలపై శిక్షణ అందించారు. శిక్షణలో ఐటీ కోర్ విభాగానికి చెందిన సజీవ్, రాజేష్, ఎనాలసిస్ టీం శివ, రాజలింగం, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు ఉన్నతాధికారులు

మట్టి గణపయ్యలే మేలు

- పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి
- రంగుల విగ్రహాలు వాడొద్దు
- అడిషనల్ డీజీపీ తేజ్‌దీప్ కౌర్

పటాన్‌చెరు: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుల వినియోగం మరింతగా పెరగాలని అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ తేజ్‌దీప్ కౌర్ అన్నారు. సోమవారం అమీన్‌పూర్‌లోని పెద్ద చెరువు కట్టపై పర్యావరణ పరిరక్షక సంఘాలతో కలిసి స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది మట్టి వినాయకుల వినియోగంపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి అమీన్‌పూర్ గ్రామస్థులతో పాటు చెరువు సమీప కాలనీలు, ఆయా పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా తేజ్‌దీప్‌కౌర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తాము చేస్తున్న కృషి ఫలించిందన్నారు. అనేక జీవరాసులు, వలస పక్షులకు ఆలవాలమైన పెద్ద చెరువును కాలుష్యం భారి నుంచి కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ప్లాస్టిక్, సిమెంట్, ఇతర ప్రమాదకరమైన రసాయన రంగులతో చెరువులోని నీరు కలుషితమవుతుందన్నారు. అందులోని జీవరాసులు మృత్యువాత పడుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలని కోరారు. తాము మూడేళ్లుగా నవరాత్రులు నిర్వహకులు, గ్రామస్థులకు పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహనతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. పర్యావరణానికి చేటు కలిగించే రంగుల విగ్రహాలను వాడొద్దని సూచించారు. పర్యావరణ పరిరక్షణను సామాజిక ఉద్యమంలా కొనసాగించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ విస్తృతంగా ప్రచారం చేయాలని తేజ్‌దీప్ కౌర్ కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మంజుల, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



చెరువు కట్టపై ప్రదర్శిస్తున్న మట్టివినాయకులు

‘ఈ-పాస్’ ఇక్కట్లు

- యంత్రాల్లో తలెత్తుతున్న సాంకేతిక లోపాలు
- సిగ్నల్స్ అందక వేలిముద్ర ప్రక్రియ జాప్యం
- గంటల తరబడి పడిగాపులు
- పనులు మానుకుని వస్తున్న లబ్ధిదారులు

జహీరాబాద్: రేషన్ సరుకుల పక్కదారి పట్టకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-పాస్ విధానం ప్రజలను ఇక్కట్లకు గురిచేస్తోంది. సిగ్నల్స్ సరిగా అందకపోవడంతో సరుకుల పంపిణీకి తీవ్ర జాప్యమవుతోంది. దీంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది.

జహీరాబాద్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో 208 రేషన్ దుకాణాలకు గానూ 93,674 కార్డులున్నాయి. 3,16,879మంది లబ్ధిదారులకు గానూ 2015 టన్నుల బియ్యం సరఫరా అవుతోంది. ఈ బియ్యం కిలో రూపాయి చొప్పున ప్రభుత్వం సరఫరా చేస్తోంది. అయితే పలువురు రేషన్ డీలర్లు తూకంలో మోసానికి పాల్పడుతున్నారంటూ తరచూ లబ్ధిదారుల నుంచి వస్తున్న ఆరోపణలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం బయోమెట్రిక్(ఈ-పాస్) విధానాన్ని తెచ్చింది. అందుకు ప్రత్యేక యంత్రాలను కొనుగోలు చేసి రేషన్ డీలర్లకు అందజేసింది. ప్రభుత్వ లక్ష్యం బాగున్నప్పటికీ పలుప్రాంతాల్లో ఈపాస్ యంత్రాలు సాంకేతిక లోపాల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో లబ్ధిదారులు గంటల తరబడి సరుకుల కోసం వేచి చూడాల్సి వస్తోంది.



రేషన్ దుకాణం వద్ద పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

సాంకేతిక లోపాలతో సమస్యలు

రేషన్ సరుకుల పంపిణీలో ఈ-పాస్ యంత్రాల్లో సాంకేతిక లోపాలు తలెత్తుతున్నాయి. రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ డీలర్ల వద్ద ఉన్న బయోమెట్రిక్ యంత్రంపై వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది. అలా వేలి ముద్రలు వేయగానే లబ్ధిదారుడి వివరాల సమాచారం క్షణాల్లో పౌరసరఫరాల విభాగానికి చేరుతుంది. ఆ తరువాత వారికి ఇవ్వాల్సిన సరుకుల బరువుతో సహా వివరాలను అందులో చూపుతుంది. ఆయా సరుకులను లబ్ధిదారులు తీసుకెళ్లవచ్చు. అయితే ఇక్కడే అసలు సమస్య ఉత్పన్నమవుతోంది. వేలి ముద్రలు తీసుకునే సమయంలో యంత్రాలకు సిగ్నల్స్ అందడం లేదు. దీంతో పౌరసరఫరాల శాఖ లబ్ధిదారులను గుర్తించలేకపోతోంది. ఈ వేలిముద్రల ప్రక్రియ వద్దే డీలర్లు, లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. దుకాణాల వద్ద గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా ఈ పాస్ యంత్రం సమస్యలను పరిష్కరించే ఆపరేటర్ జహీరాబాద్ డివిజన్‌కు ఒకరే ఉన్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే ఆపరేటర్ వచ్చే వరకు ఎదురు చూడాల్సి వస్తోంది. దీంతో ఈ నెల మొదటి వారంలోనే రేషన్ సరుకులు పూర్తిస్థాయిలో పంపిణీ జరగాల్సి ఉన్నప్పటికీ 21రోజులు గడుస్తున్న 20శాతం పంపిణీ మాత్రమే జరిగింది. నెలనెలా రేషన్ బియ్యంపైనే ఆధారపడి జీవిస్తున్న పేదలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. పనులను మానుకుని రేషన్ షాపుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది.

రేషన్ దుకాణాలు బంద్

యంత్రాల నిర్వాహణ తీరుతెన్నులు తెలియకపోవడంతో పాటు సాంకేతిక లోపాలు తలెత్తితే చేసేదిలేక డీలర్లు దుకాణాలను మూసేస్తున్నారు. డివిజన్‌లోని ఒక ఆపరేటర్ మాత్రమే ఉండడంతో అందరికి ఇబ్బందిగా మారింది. కొన్ని ప్రాంతాల్లో ఇచ్చిన యంత్రాలను వినియోగించే విధానం తెలియక, మరికొన్ని ప్రాంతాల్లో యంత్రాలకు సిగ్నల్స్ అందక సరుకుల పంపిణీ గందరగోళంగా మారింది. లబ్ధిదారులు దుకాణాల ఎదుట ఆందోళనకు గురవుతున్నారు.

కొత్త విధానంతో కొంత ఇబ్బందే



బయోమెట్రిక్ యంత్రాలతో రేషన్ సరుకుల పంపిణీ చేయడంలో డీలర్లకు అనుభవం లేదు. మిషన్లు కూడా సరిగా పని చేయ డంలేదు. కొత్త విధానంతో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సాంకేతిక లోపాలతో సరుకుల పంపిణీకి తీవ్ర ఇబ్బందిగా మారింది. త్వరలోనే ఈ విధానంతో సకాలంలో పంపిణీ చేసేందుకు కృషి చేస్తాం.

-మశ్చేందర్,
రేషన్‌డీలర్ల మండలాధ్యక్షుడు, జహీరాబాద్

జహీరాబాద్ డివిజన్‌లోని మండలాల వారీగా రేషన్ వివరాలు

మండలం	దుకాణాలు	రేషన్ కార్డులు	లబ్ధిదారులు	బియ్యం (టన్నులు)
జహీరాబాద్	56	32,000	1,11,759	726.00
మొగుడంపల్లి	21	9,605	32,265	193.50
కోహీర్	35	15,563	33,997	204.00
రాయికోడ్	31	10,406	50,365	332.00
ఝరాసంగం	29	11,398	38,128	228.00
న్యాల్‌కల్	36	14,702	50,365	332.00

త్వరలోనే పరిస్థితి మెరుగుపడుతుంది



బయోమెట్రిక్ యంత్రాల నిర్వాహణలో ఇబ్బందులు తలెత్తుతున్న మాట వాస్తవమే. యంత్రాలను ఇప్పుడిప్పుడే వినియోగిస్తుండడం, డీలర్లకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం, యంత్రాలకు సిగ్నల్స్ అందకపోవడం తదితర కారణాలతో లబ్ధిదారులు సకాలంలో సరుకులు పొందలేకపోతున్నారు. వేలిముద్రలు సరిపోలకపోతే కంటి ఫొటోల ఆధారంగా సరుకులను పంపిణీ చేయొచ్చు. యంత్రాల్లో సాంకేతిక లోపాలను సవరించి అందరికీ సరుకులు అందేలా చూస్తాం.

-గీత, తహసీల్దార్, జహీరాబాద్

గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు రూరల్: గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం రుద్రారం గణేష్ దేవాయలంలో సతీసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో పరిస్థితులను సమీక్షించారు. అనంతరం దేవాలయ కమిటీ, స్థానిక నేతలు, అధికారులతో సమావేశమై గణేష్ ఉత్సవాల ఏర్పాటుపై సమీక్ష జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు.

కిటకిటలాడిన ఆలయాలు

శ్రావణమాసం సోమవారం, అమావాస్య పుణ్యదినం కావడంతో మండల పరిధిలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా ఈశ్వరాలయాల్లో భక్తులు ఉదయం నుంచే బారులు తీరారు. శ్రావణమాసం, సోమవారం, అమావాస్య కలయిక 500 సంవత్సరాలకు ఒక సారి వస్తుందని అందుకే ఈ రోజు చాలా పవిత్రమైన పర్వదినంగా చెబుతారని ముత్తంగికి చెందిన ప్రముఖ వేద పండితులు పాణ్యం రంగనాధశాస్త్రి తెలిపారు. నేటి పర్వదినాన శివుని గుడిలో అభిషేకం, అర్చన చేసుకుంటే దోషాలు పోతాయని ఆయన తెలిపారు.



రుద్రారం గణేష్ ఆలయంలో పరిస్థితిని సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిల్లా స్థాయి పోటీలకు డాకూరు విద్యార్థులు

జోగిపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో మండలంలోని డాకూరు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. ఖోఖో పోటీల్లో జూనియర్ స్థాయి బాలికల విభాగంలో లిఖిత, నర్సమ్మ, రేఖ, అంజలి, శైలజ, సీనియర్ విభాగంలో సౌమ్య, దుర్గలత, పుష్పలత, మేఘన అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఖో-ఖో పోటీల్లో జూనియర్ బాలుర విభాగంలో రాకేశ్ గౌడ్, సాయికిరణ్, మనోజ్, మోహన్, విష్ణువర్దన్, సీనియర్ విభాగంలో దినేశ్ గౌడ్, వెంకటేశం, మల్లేశం, అనిల్, బాల్‌రాజ్, సాయికుమార్ ఎంపికయ్యారు. కబడ్డీ పోటీల్లోనూ సీనియర్ బాలికల విభాగంలో డాకూరు విద్యార్థులు రాణి, రుచిత, సీనియర్ బాలుర విభాగంలో వినయ్, మహేశ్, జూనియర్ బాలుర విభాగంలో దత్తు, శ్రీకాంత్ కలిపి మొత్తం 28 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేరి నాగేశ్వర్ రావు, సర్పంచ్ శంకరయ్య, ఎస్ఎంసీ చైర్మన్ పద్మారావు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

'గణేష్ ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి'

రామచంద్రాపురం: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో నిర్వాహకులు విధిగా నిబంధనలు పాటించాలని రామచంద్రాపురం సీఐ భాస్కర్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ సైబరాబాద్‌లో విలీనం అయిన తరువాత జరుగుతున్న మొదటి గణేష్ ఉత్సవమన్నారు. వినాయక మండపాల నిర్వాహకులు మండపాల్లో మైకులు ఏర్పాటు చేస్తే విధిగా మియాపూర్ ఏసీపీ అనుమతి తీసుకోవాలన్నారు. స్థానిక విద్యుత్ ఏఈ అనుమతితో మండపంలో విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలను రాత్రి పదిగంటల్లోగా ముగించాలన్నారు. డీజేలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేదిలేదన్నారు. గణేష్ విగ్రహ ఊరేగింపు సందర్భంగా రోడ్ మ్యాప్ ప్రకారం పోలీసు బందోబస్తు ఉంటుందని చెప్పారు. భద్రత నియమాలు పాటించి వినాయకులను నిమజ్జనం చేయాలని సూచించారు.

'మీజిల్స్ టీకా పిల్లల ఆరోగ్యానికి వరం'

రామచంద్రాపురం: మీజిల్స్-రుబెల్లా వ్యాక్సిన్ పిల్లల ఆరోగ్యానికి వరం లాంటిదని రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షురాలు, బండ్లగూడ సర్పంచ్ ముత్యాల జయమ్మ అన్నారు. సోమవారం బండలగూడలోని సెయింట్ మేరీ పాఠశాలలో సుమారు 2 వందల మంది విద్యార్థులకు ఏఎన్ఎం, ఆశావర్కర్లు మీజిల్స్-రుబెల్లా వాక్సిన్‌ను అందించారు. జయమ్మ మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి చర్యలు చేపట్టడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు విధిగా పిల్లలకు వ్యాక్సిన్లు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాబర్ట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఈత మొక్కల పెంపుపై ప్రత్యేక దృష్టి'

గుమ్మడిదల: ప్రభుత్వం ఈత మొక్కల పెంపకం పై ప్రత్యేక దృష్టి సారించి ముందుకుపోతున్నట్లు ఎక్సైజ్ సూపరిండెంట్ జానయ్య పేర్కొన్నారు. సోమవారం గుమ్మడిదలలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్క చెరువు సమీపంలో ఎక్సైజ్ శాఖ నుంచి వచ్చిన 400 ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారంలో భాగంగా ప్రభుత్వం ఈత మొక్కల పెంపుకు ప్రాధాన్యత ఇస్తూ ప్రతి గ్రామంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ఈత మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మణూర్‌లో 2వేలు, గుమ్మడిదలలో 400, కొడకంచిలో వెయ్యి మొత్తం 7వేల ఈత మొక్కలు నాటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సీతారాంరెడ్డి, ఎస్ఐ రాజ్యలక్ష్మి, గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'విమోచనం'ను అధికారికంగా నిర్వహించాలి

జిన్నారం: సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని మండల బీజేపీ నాయకులు రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. సోమవారం జిన్నారంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో ప్రతాప్‌రెడ్డి, గిద్దెరాజు, లక్ష్మణ్‌రావు, భరత్‌చారి, గంగు రమేష్, నర్సింగ్‌రావు, మన్నె రాజు, బుక్క వెంకటేశం, రామాంజనేయరెడ్డి, రవీందర్‌రెడ్డి, హన్మంత్‌చారి, రమేష్ తదితరులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన జరిపారు. సెప్టెంబర్ 17న ప్రతి ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగుర వేయాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ భిక్షపతికి వినతి పత్రం అందజేశారు.

అనాథాశ్రమానికి వ్యాపారుల వితరణ

జోగిపేట: సంగారెడ్డికి చెందిన ప్రముఖ న్యాయవాది మనోహర్, జోగిపేటకు చెందిన వస్త్ర వ్యాపారుల సంఘం అధ్యక్షుడు రంగ ఓంప్రకాశ్ గుప్త, యెదిరె రమేష్ గుప్త, కటుకం ప్రవీణ్‌గుప్త, నామ విఠల్, వీరభద్ర సంగమేశ్వర్, కొడిపాక హన్మాండ్లు, కట్కం కిరణ్ ఆధ్వర్యంలో సోమవారం జోగిపేటలోని ఆర్యసమాజంలోని అనాథలకు, మానసిక వికలాంగులకు దుస్తులు, దుప్పట్లు, కాస్మోటిక్స్‌ను అందజేశారు.

మంత్రి చొరవతో 6 వేల ఎకరాలు సాగులోకి

- ఏఎంసీ చైర్మన్ నాగభూషణం

జోగిపేట: మంత్రి హరీశ్ రావు, అందోలు ఎమ్మెల్యే బాబూమోహన్ చొరవతో అందోలు, పుల్కల్ మండలాలు సస్యశ్యామలమౌతున్నాయని జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ డీబీ నాగభూషణం, నగర పంచాయతీ టీఆర్ఎస్ శాఖాధ్యక్షుడు చాపల వెంకటేశం అన్నారు. సోమవారం వారు సింగూరు కాల్వల కింద సాగవుతున్న పంట పొలాలను, సింగూరు నీటితో నిండిన అందోలు చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ముప్పై ఏళ్లుగా సేద్యానికి సాగునీటి కోసం ఈ ప్రాంత ప్రజలు ఎదురు చూశారన్నారు. అర్ధంతరంగా ఆగిన కాల్వల నిర్మాణం మంత్రి హరీశ్, ఎమ్మెల్యే బాబూమోహన్ చొరవతో పూర్తయిందన్నారు. కాల్వల ద్వారా ప్రతీ యేటా 2 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు మంత్రి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ నీటితో 6 వేల ఎకరాలు సాగులోకి వచ్చాయని, చెరువులు నింపడం ద్వారా మరో 10 వేల ఎకరాలు సాగులోకి వచ్చాయని త్వరలోనే మరో 30 వేల ఎకరాలు సాగులోకిరానున్నాయని వారన్నారు. అందోలును సస్యశ్యామలంగా మార్చిన సీఎం, మంత్రి, ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సింగూరు కెనాల్ కింద సాగవుతున్న వరి పొలాలను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్

ఘనంగా 'శ్రావణ' యజ్ఞ పూర్ణాహుతి



దుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

జోగిపేట: శ్రావణ మాసాంతాన్ని పురస్కరించుకుని జోగిపేటలోని ఆర్యసమాజంలో సోమవారం యజ్ఞ పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం శ్రావణ, అమావాస్యను పురస్కరించుకుని ఆర్యసమాజంలో వైదిక యజ్ఞాన్ని జరిపి ముగింపుగా పూర్ణాహుతిని నిర్వహించారు. అనంతరం బొంతపల్లి వేదాశ్రమ నిర్వాహకురాలు మాతాజీ నిర్మల యోగభారతి, నాదులాపూర్ ఆశ్రమ పీఠాధిపతి శివానంద స్వామి, ఆర్యసమాజం ప్రబోధకుడు స్వామి భీష్మాచార్యులు సత్సంగాన్ని నిర్వహించి, దేశ ఔన్నత్యాన్ని, వైదిక కార్యక్రమాల విశిష్టత, యజ్ఞాల ఆవశ్యకతను వివరించారు. అనంతరం, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యసమాజ్ సభ్యులు అల్లె చిన్న మల్లయ్య, అరిగె ఆశయ్య, రంగంపేట రాంచందర్, బేలూరి రవీందర్, లింగమయ్య, సంగమేశ్వర్ సంగం, పల్లె రమేష్, భక్తులు హాజరైనారు.

దుర్గమ్మ ఆలయంలో అభిషేకాలు

జిన్నారం: జిన్నారం దుర్గమ్మ దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో చివరి శ్రావణ సోమవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజ, అభిషేక కార్యక్రమాలు జరిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశంగౌడ్, బోజిరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, బుక్క వెంకటేశం, నీలం మోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వ్యవసాయ శాఖ కార్యాలయం

హత్నూర: హత్నూర వ్యవసాయ శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కొన్నేళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. భవనం గోడలకు పగుళ్లు రాగా స్లాబు పైకప్పు పెచ్చులూడి ఇనుప చువ్వలు తేలాయి. ఆ భవనంలో కూర్చొని విధులు నిర్వహించాలంటే సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పలుమార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకునే వారు కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న వ్యవసాయ శాఖ భవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మించాలని సిబ్బంది, స్థానికులు కోరుతున్నారు.



భవనం పైకప్పు పెచ్చులూడిన దృశ్యం

నేటి నుంచి క్రీడా పోటీలు

హత్నూర: ఈనెల 22 నుంచి మండలంలోని ఆయా పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బోర్పట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించే ఈ క్రీడా పోటీల్లో మండలంలోని ఆయా పాఠశాలల జట్లు పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. ఈ క్రీడలు ఈనెల 24వరకు కొనసాగుతాయని ఎంఈవో పేర్కొన్నారు.

నీటి సరఫరా కోసం మరమ్మతులు

జిన్నారం: బొల్లారంలో నిలిచిపోయిన నీటి సరఫరాకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. సోమవారం బొల్లారంలో నీటి సరఫరా కోసం చేపట్టిన మరమ్మతు పనులను జలమండలి అధికారులు రవీందర్, మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి పరిశీలించారు. పదిరోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర సమస్య నెలకొనగా, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టారు.

6 నెలలుగా అందని పెన్షన్లు

జిన్నారం: శివానగర్‌లో ఆరు నెలలుగా పెన్షన్లు అందడం లేదని గ్రామ సర్పంచ్ పూజారి రాజు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన 30 మందికి వితంతు, వృద్ధాప్య పెన్షన్లు ఆరు నెలలుగా రావడం లేదని, బ్యాంకులు, జిల్లా కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. గ్రామంలో పోస్టాఫీస్ ఉన్నా బ్యాంకుల ద్వారా చెల్లించడం, ఆన్‌లైన్ పొరపాట్ల వల్ల బాధితులకు పెన్షన్ అందడం లేదని వెంటనే అధికారులు సమస్యను పరిష్కారించాలని డిమాండ్ చేశారు.

'సీఎంకు అరుదైన గౌరవం లభించడం అభినందనీయం'

గుమ్మడిదల: సీఎం కేసీఆర్‌కు భారత ఆహార వ్యవసాయ మండలి నుంచి అరుదైన గౌరవం లభించడం అభినందనీయమని టీఆర్ఎస్ జిల్లా నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మక అగ్రికల్చర్ లీడర్ షిప్ 2017 అవార్డును కేసీఆర్‌ను వరించడం తెలంగాణ ప్రజలకు ఎంతో ఆనందం కల్గించిందన్నారు. ఈ కార్యక్రమంలో కుమార్‌గౌడ్, ఎం.నరేందర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, మంద భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, దర్గారెడ్డి, పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి, నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఓటరు లెక్క ఇకపై పక్కా'

కొండాపూర్: ప్రతి ఇంటికి వెళ్లి ట్యాబ్ ద్వారా ఇంటి నెంబర్, ఇంటి యజమాని పేరును ట్యాబ్‌లో నమోదు చేసి వారి కుటుంబ సభ్యులను ఓటరు జాబితాలో చేర్చుతామని తహసీల్దార్ శ్రీశైలం పేర్కొన్నారు. ఎవరైనా మరణించినా వారిని తొలగించడం, 18 ఏళ్లు నిండిన యువతీ యువకుల పేర్లను నమోదు చేస్తున్నామన్నారు.

నిధులున్నా ప్రయోజనం సున్నా!

● ఏడాది గడిచినా చేపట్టని రోడ్డు నిర్మాణం ● గుత్తేదారు నిర్లక్ష్యంతో ప్రయాణికులకు ప్రాణ సంకటం ● పట్టించుకోని అధికారులు

కొండాపూర్: తెలంగాణ ప్రభుత్వం అధికారం చేపట్టగానే సీఎం కేసీఆర్ రహదారులపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామీణ ప్రాంత రహదారులను అద్దంలా తీర్చిదిద్దుతున్న నేపథ్యంలో గుత్తేదారుల నిర్లక్ష్యంతో సీఎం లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. ఇందుకు నిదర్శనమే మల్కాపూర్-మల్లేపల్లి రహదారి. గత ఏడాదిలో ఈ రహదారి నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావు, ఎంపీ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ రూ.12.50 కోట్ల వ్యయంతో శంకుస్థాపన చేశారు. నాటి నుంచి నేటి వరకు రహదారి నిర్మాణానికి నిధులు పుష్కలంగా ఉన్నా సంబంధిత గుత్తేదారు నిర్లక్ష్య వైఖరికి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాది గడిచినా రహదారి నిర్మాణం చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఇదిలా ఉంటే జాతీయ రహదారి మల్కాపూర్ చౌరస్తాలో నేషనల్ హైవే అథారిటీ ప్రాతినిధ్యం వహిస్తున్న జాతీయ రహదారుల నిర్మాణంలో మల్కాపూర్ చౌరస్తా కూడలిలో రెండు నెలల క్రితం కల్వర్టు నిర్మాణం చేపట్టేందుకు సంబంధిత గుత్తేదారులు గుంతలు తవ్వి వదిలేశారు. ఆ రహదారి పై నుంచే రోజుకు వందల లారీలు రాకపోకలు జరుగుతాయి. మల్కాపూర్ కూడలి దాటాలంటే ప్రయాణికులు వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డును దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రహదారుల నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో గుత్తేదారులకు నోటీసులు జారీ చేసి మళ్లీ టెండర్లకు రీకాల్ చేయాలని పలువురు ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.


మల్కాపూర్ చౌరస్తాలో రెండు నెలల నుంచి మరమ్మతు చేయని రోడ్డు

మజ్దూర్ సెల్ రాష్ట్ర కోకన్వీనర్‌గా రవీందర్‌రెడ్డి

కొండాపూర్: భారతీయ జనతా పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పార్టీ అనుబంధ సెల్స్ కమిటీలను నియమించామని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు కాసాల బుచ్చిరెడ్డి తెలిపారు. కార్మిక సంఘం మజ్దూర్‌సెల్ రాష్ట్ర కోకన్వీనర్‌గా కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఇవురం రవీందర్‌రెడ్డిని నియమించినట్టు ఆయన తెలిపారు.

28న ఓరియంటేషన్ ప్రోగ్రాం

సంగారెడ్డి అర్బన్: జిల్లాలోని ఓపెన్‌స్కూల్ విధానంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల నిర్వాహణకు గాను అన్ని అధ్యాయన కేంద్రాల కోఆర్డినేటర్లకు ఈనెల 28న ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్టు డీఈవో విజయ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పని సరిగా హాజరుకావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమానికి నష్టమెంటరీ పరీక్షల నామినల్ రూల్స్ తీసుకురావాలని సూచించారు.

ఆధార్ నమోదుపై శిక్షణ

కొండాపూర్: మండలంలోని వివిధ ప్రాథమిక, ప్రాథమికోన్నత జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి ఆధార్ కార్డులను నమోదు చేయాలని ఎంఈవో బీసింగ్ అన్నారు. సోమవారం కొండాపూర్ ఎంఈవో కార్యాలయంలో మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 6,500 మంది విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే 2000 మంది విద్యార్థుల ఆధార్ కార్డు నమోదును తప్పనిసరి అన్నారు.

తారా కళాశాల ఏబీవీపీ అధ్యక్షుడిగా భాస్కర్

సంగారెడ్డి అర్బన్: తారా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ఏబీవీపీ అధ్యక్షుడిగా భాస్కర్ నియమితులయ్యారు. సోమవారం సంగారెడ్డిలోని 3 కళాశాలల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తారా కళాశాల కార్యదర్శిగా సంతోష్, ఉపాధ్యక్షులుగా సాయితేజ, నవీన్, సూర్య, సంయుక్త కార్యదర్శులుగా అరుణ్‌కుమార్‌గౌడ్, ప్రతాప్ గౌడ్, మోహన్, సంతోష్‌కుమార్, మాస్టర్ డిగ్రీ కళాశాల అధ్యక్షుడిగా కార్తీక్, కార్యదర్శిగా సోహేల్, ఎల్లంకి డిగ్రీ కళాశాల అధ్యక్షుడిగా బస్వంత్‌రెడ్డి, కార్యదర్శిగా కౌశిక్‌రెడ్డిని జిల్లా కన్వీనర్ ఆనంద్‌శ్వర్, నగర కార్యదర్శి అశోక్ సమక్షంలో ఎన్నుకున్నారు.

'కస్తూర్బా'లో మౌలిక వసతులు కరువు

● ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం ● విద్యార్థినులకు తప్పని అవస్థలు

కొండాపూర్: జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరం లేని కొండాపూర్ మండలంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అన్ని సమస్యలే. ఆ విద్యాలయంలో జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన పేద విద్యార్థినులకు ఆసరా కరువైంది. 198 మంది విద్యార్థినులు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు. ప్రతి సంవత్సరం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఈ పాఠశాలలో చదివే పదో తరగతి విద్యార్థినులు వందకు వంద శాతం ఉత్తీర్ణులవుతున్నారు. పాఠశాలలోని ఐదు గదులకు డోర్లు లేక, కిటికీలకు డోర్లు, విద్యుత్ సదుపాయం, ఫర్నీచర్ లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రానికి అర కిలోమీటర్ దూరంలో ఉన్న ఈ బాలికల విద్యాలయంలో ఆడుకునేందుకు సరిగా ఆట స్థలం కూడా లేదు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించి పేద విద్యార్థులకు ఆసరా కల్పిస్తే ఉన్నత శిఖరాలకు ఎదిగే అవకాశం ఉంటుంది.


కిటికీలకు తలుపులు లేని దృశ్యం

'మానవ మనుగడకు చెట్లే ఆధారం'


కొండాపూర్‌లోని ప్రధాన రహదారి పక్కన మొక్కలు చుట్టూ గడ్డిని తొలగిస్తున్న దృశ్యం

సదాశివపేట రూరల్: చెట్టు మానవ జీవరాశి మనుగడకు ఆధారమని, అవసరమైన ఆక్సిజన్‌ను వదిలి ప్రమాదకరమైన కార్బన్‌డై ఆక్సైడ్‌ను పీల్చుకొని పర్యావరణంలో సమతుల్యాన్ని కాపాడతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తాడెపల్లి పతంజలి తెలిపారు. సోమవారం పట్టణంలోని డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ల ఆధ్వర్యంలో తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి గంగాధర్ మాట్లాడుతూ మొక్కలు నాటడం ఎంత ప్రధానమో వాటిని సంరక్షించి భావితరాలకు అందించడం అంతే ప్రధానమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి డాక్టర్ జగదీశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.రామచంద్రం, అధ్యాపకులు జ్యోతి, శంకరయ్య, శ్రీనివాస్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో

కొండాపూర్: హరితహారంలో భాగంగా ఎక్సైజ్‌శాఖ అధికారులు కొండాపూర్ నుంచి సీతారాంకుంట వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఆ మొక్కలను రక్షించేందుకు వాటి చుట్టూ గడ్డిని తొలగించే యంత్రంతో తొలగిస్తున్నారు.

'గుడుంబా'ను వదిలేసిన వారికి 'ఉపాధి' పై సదస్సు

కంది: గుడుంబా తయారీ చేసి వదిలేసిన వారికి అధికారులు అవగాహన కల్పించారు. గుడుంబా నియంత్రణ పథకం ద్వారా మండలంలోని వివిధ గ్రామాల్లోని తండావాసులు గొర్రెలను పొంది ఉపాధి పొందుతున్నారు. కంది, కంది తండా, బ్యాతోల్ తండా, చెర్యాల తండా, చిమ్నాపూర్ తండాలకు చెందిన 15 కుటుంబాలకు సోమవారం పశువైద్య శాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్సైజ్, పశువైద్యాధికారులు చేపట్టిన ఈ సదస్సుకు తండావాసుల నుంచి విశేష స్పందన లభించింది. పశువైద్యాధికారి ఇర్ఫానోద్దీన్ సిద్దికి పశుపోషణపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. వానకాలంలో గొర్రెలు, మేకలకు కలిగే రోగాల గురించి వివరించి వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్యపరిచారు. అలాగే మృతి చెందిన పశువులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఇన్సురెన్స్ గురించి వివరించారు. ఎక్సైజ్ ఎస్‌ఐ నందు గుడుంబా మానేసిన వారికి ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి పథకాలపై అవగాహన కల్పించారు. కందితో పాటు బ్యాతోల్ గ్రామాల్లో సోమవారం పశువైద్యాధికారులు గొర్రెలు, మేకలకు రోగ నిరోధక టీకాలు వేశారు. వైద్యాధికారి ఇర్ఫానోద్దీన్ సిద్దికి పశువులను పరీక్షించి చిటుక (ఎంటరోటాక్సిమియ) లక్షణాలు గుర్తించి నివారణ టీకాలు ఇచ్చారు.

ఆలయాలకు శ్రావణ శోభ

సదాశివపేట: శ్రావణ మాసం చివరి రోజైన సోమవారం సదాశివపేట పట్టణంలోని పలు ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. భక్తులు ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. సోమవారం చివరి రోజు కావడంతో పట్టణంలోని సంగమేశ్వర ఆలయం, ఈశ్వర మార్కండేయ మందిరం, శంభులింగేశ్వర మందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

ఘనంగా అఖండ బిల్వార్చన

సంగారెడ్డి రూరల్: శ్రావణమాసంలో చివరి సోమవారం అమావాస్యను పురస్కరించుకుని పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలోని వీరభద్రస్వామి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ ధర్మప్రచార సమితి అధ్వర్యంలో శివభక్తి గీతాలు ఆలపించారు. 12 హారతులతో స్వామికి మంగళహారతులిచ్చారు. సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు జగ్గారెడ్డిని ఘనంగా సన్మానించారు.

'నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే క్విజ్ పోటీలు'


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎంఈవో అంజయ్య

సదాశివపేట: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే గణిత క్విజ్‌పోటీలు నిర్వహించామని ఎంఈవో అంజయ్య అన్నారు. ఈ పోటీలు స్థానిక మండల వనరుల కేంద్రంలో నిర్వహించారు. మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా జడ్పీహెచ్ఎస్ పెద్దాపూర్,ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ సదాశివపేట విద్యార్థులు అందుకున్నారు. ప్రథమ స్థానంలో గెలుపొందిన వారికి ఈనెల 24న డివిజన్ స్థాయిలో 28వ తేదీన జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయని ఎంఈవో అంజయ్య పేర్కొన్నారు.

'పంట నష్టపరిహారం అందించాలి'

సదాశివపేట రూరల్: గత యేడాది భారీ వర్షాలకు రైతులు నష్టపోయిన పంట నష్టపరిహారం అందించాలని మెదక్ జిల్లా మంజీర రైతు సమాఖ్య అధ్యక్షులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ అనిల్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం పృథ్వీరాజ్ మాట్లాడుతూ గత ఏడాది పంట నష్టపోయిన వారికి ప్రభుత్వం పంట నష్టం అంచనా వేసింది. అయినప్పటికీ నేటికి రైతులకు నష్టపరిహారం అందకపోవడం దురదృష్టకరమన్నారు. ఎకరాకు రూ.2వేలు నష్టపరిహారం రైతులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

నీరు లీకేజీతో వాహనదారుల అవస్థలు

సంగారెడ్డి అర్బన్: పట్టణంలోని ప్రశాంత్‌నగర్ పరిధిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో మంజీర పైప్‌లైన్ లీకేజీతో రోడ్లన్నీ పూర్తిగా జలమయమయ్యాయి. ఇంద్రకాలనీ వెళ్లేందుకు కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొన్ని రోజులుగా కొనసాగుతున్న మంజీర నీరు లీకేజీని అరికట్టాలని, రోడ్డు బాగు చేయించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంజీర లీకేజీని అరికట్టి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

మోకాళ్ల పై కూర్చొని తపాలా సేవకుల నిరసన

సంగారెడ్డి రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామీణ తపాలా సేవకులు సంగారెడ్డిలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి ఆరో రోజుకు చేరుకుంది. ఆరో రోజు వారు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి బస్వరాజ్, యాదమ్మ పాల్గొన్నారు.

'తట్టు రుబెల్లా వ్యాధిపై అప్రమత్తత అవసరం'

వట్‌పల్లి/సంగారెడ్డి రూరల్: తట్టు రుబెల్లా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ లక్ష్మి తెలిపారు. సోమవారం జడ్పీహెచ్ఎస్ వట్‌పల్లి పాఠశాల, సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు టీకాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వట్‌పల్లి ఎంపీటీసీ శివాజీరావు, జడ్పీటీసీ పోరం జిల్లా అధ్యక్షుడు మనోహర్‌గౌడ్, ఇస్మాయిల్‌ఖాన్‌పేట సర్పంచ్ పూజ నాగరాజ్, సూపర్‌వైజర్ వినోద, హెచ్ఈ ప్రభాకర్ పాల్గొన్నారు.

నారాయణఖేడ్ సినిమాలు

షెట్కార్‌సువర్ణ జయ జానకి నాయక
వెంకటేశ్వర నేనే రాజు.. నేనే మంత్రి

పెద్దశంకరంపేట

లక్ష్మి జయ జానకి నాయక


గజగజ వణికిన విద్యార్థులు

- సీలింగ్ పెచ్చులూడిన రాపర్తి పాఠశాల భవనం
- వర్షంతో తడిసి ముద్దయిన నాలుగు గదులు



పెచ్చులూడి కింద పడిన సిమెంటు ముక్కలు

కల్హేర్: మండల పరిధిలోని రాపర్తి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన తరగతి గదులు నాలుగు ఉండగా అవన్నీ శనివారం కురిసిన భారీ వర్షానికి తడిసి ముద్దయ్యాయి. ఫలితంగా సోమవారం పాఠశాల ప్రారంభానికి ముందే పైకప్పు సీలింగ్ పెచ్చులు ఊడి కింద పడడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయభ్రాంతులకు గురయ్యారు. వర్షం నీటికి గదులన్నీ ఉరుస్తుండడంతో విద్యార్థులు కూర్చోవడానికి సైతం వీలు లేకుండా మారి పోయింది. తరగతి గదుల పైకప్పులు వర్షం నీటితో నాని పోయి ఉండడంతో ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితుల్లో విద్యార్థులు వణికి పోతున్నారు. నాలుగో తరగతి నిర్వహిస్తున్న గదిలో సోమవారం పాఠశాల ప్రారంభానికి ముందే పెచ్చులూడి పడటం, మిగతా గదుల్లోను గోడలు, పైకప్పులు ప్రమాదకరంగా మారడంతో విద్యార్థులను సోమవారం ఆరు బయటే కూర్చోబెట్టి పాఠాలు బోధించినట్లు పాఠశాల ఉపాధ్యాయుడు హన్మంతు తెలిపారు. ఎన్నారు.



కూలడానికి సిద్దంగా ఉన్న రాపర్తి పాఠశాల భవనం పైకప్పు

భారీ వర్షంతో కూలిన గృహాలు, దెబ్బతిన్న పెసర పంట



కల్హేర్‌లో కూలిన ఇల్లు

కల్హేర్: మండల కేంద్రమైన కల్హేర్‌తో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికి అందే దశలో ఉన్న పెసర పంట నీటి పాలవ్వగా, గ్రామాల్లో నివాస గృహాలు కూలి పోయాయి. కల్హేర్, రాపర్తి, నాగ్‌ధర్, బాచేపల్లి, క్రిష్ణాపూర్, మార్డి, బీబీపేట, మాసాన్‌పల్లి తదితర గ్రామాల్లో అత్యధికంగా గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కొన్ని పూర్తిగా కూలి పోవడంతో నివాసానికి పనికి రాకుండా పోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. నష్టానికి గురైన గృహాల సంఖ్య ఇంకా రెవెన్యు అధికారులకు అందలేదు. మాసాన్‌పల్లి - కల్హేర్ గ్రామాల నడుమ రాకపోకలు నిలిచి పోవడంతో ప్రజలు కల్హేర్‌కు చేరుకోలేక పోయారు. డైవర్షన్ రహదారి పనులు సోమవారం కొనసాగాయి.

టీటీడీ హెచ్‌డీపీపీ పోటీల్లో ర్యాకల్ విద్యార్థులకు జిల్లాస్థాయి బహుమతులు



ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందుకుంటున్న ర్యాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

నారాయణఖేడ్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్మ పరిచయం, ధర్మ ప్రవేశిక పరీక్షల్లో ర్యాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న శ్రీరాం, విఠల్‌లు జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతులు దక్కించుకున్నారు. ఈ మేరకు వారికి సోమవారం సంగారెడ్డిలోని ధర్మ ప్రచార పరిషత్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బాలేశం, ఆర్గనైజర్ స్వామినాయక్, జిల్లా సభ్యులు శివప్రసాద్‌లు విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈవో విశ్వనాథ్, హెచ్‌ఎం సత్యనారాయణ, తెలుగు ఉపాధ్యాయులు భూమయ్యలు అభినందించారు.

కడ్పల్ సంగమేశ్వర ఆలయంలో శ్రావణ మాస ముగింపు ఉత్సవం

సిర్గాపూర్: మండల పరిధిలోని కడ్పల్ గ్రామ శివారులో వెలసిన విద్యాధర సంగమేశ్వరుని పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులో ఉన్న సంగమేశ్వర ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని 41 రోజుల పాటు నిత్య పూజా, అభిషేకాలు, అన్నదాన ప్రసాద కార్యక్రమాలు గ్రామస్థులు రోజుకు ఒక సారి చొప్పున నిర్వహించడం జరిగింది. నేటితో 41 రోజులు పూర్తి అయిన సందర్భంగా ఆలయ కమిటీ గ్రామస్థులు ముగింపు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. నిత్య పూజారులు సంగయ్యస్వామి, రాములు స్వామిని సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గణితం క్విజ్‌లో ప్రథమ స్థానం దక్కించుకున్న ఖేడ్ జడ్పీఉన్నత పాఠశాల

నారాయణఖేడ్: మండల స్థాయిలో నిర్వహించిన గణితం క్విజ్‌లో తమ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అశోక్‌గౌడ్ సోమవారం తెలిపారు. మండల విద్యాధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన గణితం క్విజ్ పోటీలో 7వ తరగతి విద్యార్థి వంశీవర్ధన్, ప్రవీణ్, హరిశ్చంద్రప్రసాద్, 6వ తరగతి విద్యార్థి సతీశ్‌లు ప్రథమస్థానం దక్కించుకున్నారన్నారు. వీరికి జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు పంపుతామన్నారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకున్న విద్యార్థులకు గణితం ఉపాధ్యాయుడు సిద్దారెడ్డి, హెచ్‌ఎంతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఎమ్మెల్యే ఊరికే రహదారి కట్

- పత్తాలేని కాంట్రాక్టర్

కల్హేర్: నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి స్వగ్రామమైన మండల పరిధిలోని ఖానాపూర్(కె) గ్రామానికి రెండు రోజులుగా రాకపోకలు నిలిచి పోయాయి. గ్రామ సమీపంలో నిర్మిస్తున్న వంతెన డైవర్షన్ రోడ్డు శనివారం రాత్రికురిసిన వర్షాలకు కొట్టుకు పోయింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం సాయంత్రం వరకు రహదారి నిర్మాణ పనులను కాంట్రాక్టర్ చేపట్టక పోవడంపై గ్రామస్తులు మండి పడుతున్నారు. క్రిష్ణాపూర్, కల్హేర్ గ్రామాల వైపు నుంచి ఖానాపూర్(కె) గ్రామస్థులు చుట్టూ 10 కిలో మీటర్ల దూరం అధనంగా తిరిగి కల్హేర్, క్రిష్ణాపూర్ లతో పాటు ఇతర గ్రామాలకు చేరుకుంటున్నారు. ఈ వంతెన నిర్మిస్తున్న కాంట్రాక్టర్ పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఒక ఎమ్మెల్యే గ్రామానికే రాకపోకలు పునరుద్ధరించక పోవడమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో డైవర్షన్ రహదారులు కొట్టుకు పోయినా ఆయా కాంట్రాక్టర్లు సోమవారం మరమ్మతులు జరిపి రాకపోకలు పునరుద్ధరించారని గ్రామస్థులు అన్నారు. ఈ విషయమై కల్హేర్ ఆర్అండ్‌బీ ఏఈ రాములును ప్రశ్నించగా ఆదివారం కొంత మేరకు పనులు జరిపించిన కాంట్రాక్టర్ సోమవారం పూర్తి చేస్తాడని తెలిపాడని అయినా రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో సాధ్యపడలేదన్నాడు. మంగళవారం రాకపోకలు పునరుద్దరిస్తామని ఏఈ తెలిపాడు.



ఖానాపూర్(కె) గ్రామసమీపంలో కొట్టుకు పోయిన డైవర్షన్ రోడ్డు

భారీ వర్షంతో వంగిన విద్యుత్ స్తంభాలు

- విద్యుత్ సరఫరాకు అంతరాయం

నారాయణఖేడ్: భారీవర్షం కురియడంతో నారాయణఖేడ్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో విద్యుత్ స్తంభాలు వంగి పోయాయి. పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణం కోసం గోతులు తవ్వడానికి తోడు భారీ వర్షం కురియడంతో స్టేషన్ ఆవరణలో ఉన్న మూడు స్తంభాలు వంగి పోయాయి. దీంతో ప్రమాదకర పరిస్థితి నెలకొనడంతో ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతు పనులు చేపట్టడమే కాకుండా నూతన స్తంభాలను ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నారాయణఖేడ్‌లో సోమవారం 4.2 మీ.మీ వర్షపాతం నమోదైంది.

రేపు కాళేశ్వరం సబ్ కెనాల్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

- హాజరు కానున్న మంత్రి హరీశ్‌రావు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మండలంలోని రైతులకు సాగునీరు అందించడానికి కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి సబ్ కెనాల్‌ను ఏర్పాటు చేయనున్నందున బుధవారం 23న నారాయణఖేడ్‌లో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నామని మండల రెవెన్యు అధికారి తారాసింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నారాయణఖేడ్‌లోని మా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో భారీనాటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు పాల్గొంటారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి నిజాంపేట, ర్యాలమడుగు, నర్సాపూర్, నమ్లీమేట్, మాధ్వార్, వెంకటాపూర్, జూక్కల్, నారాయణఖేడ్, హన్మంత్‌రావుపేట, లింగాపూర్, జూక్కల్, బాణాపూర్, జూజాల్‌పూర్, చందర్‌పూర్, అనంత్‌సాగర్, జగన్నాథ్‌పూర్, సత్యగామ గ్రామాలకు చెందిన వారు హాజరైన తమ అభిప్రాయాలను తెలుపవచ్చాన్నారు. ఇంక మండలంలోని ఇతర గ్రామాల వారు కూడా తమ గ్రామానికి కూడా సబ్ కెనాల్ సౌకర్యం కల్పించాలని కూడా వినతి పత్రాలు ఇచ్చుకోవచ్చాన్నారు. పొల్యుషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సబ్ కెనాల్ నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నందున రైతులు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అభివృద్ధి పనులపై ఎంపీడీవో సమీక్ష

నారాయణఖేడ్: మండలంలో అభివృద్ధి పనులపై ఎంపీడీవో బాలయ్య సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పనులకు తోడు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాజయ్య, గౌస్, విఠల్, అరవింద్, యాదగిరి ఉన్నారు.

రహదారికి కొత్త అందాన్ని చేకూరుస్తున్న మొక్కలు



ఖేడ్ - కంగ్టి రహదారిపై మొక్కలకు ఏర్పాటుచేసిన ట్రీ గార్డులు

నారాయణఖేడ్: రహదారికి ఇరువైపులా నాటించిన మొక్కలు కొత్త అందాన్ని చేకూరుస్తున్నాయి. నారాయణఖేడ్ నుంచి కంగ్టిమీదుగా దెగుల్‌వాడి వరకు గల రహదారిని రూ.70 కోట్లతో విస్తరించే పనులు ఒక వైపు ముమ్మరంగా సాగుతుండగా మరో వైపు అటవీశాఖాధికారులు పనులు పూర్తి అయిన రహదారి గుండా ఇరువైపులా మొక్కలను నాటించడంతో పాటు ట్రీగార్డులను ఏర్పాటు చేయడంతో రహదారికి నూతన శోభ సంతరించుకుంది. దాదాపు ఇప్పటి వరకు 4,700 మొక్కలను రోడ్డుకు ఇరువైపులా నాటించడంతో పాటు ట్రీగార్డులను కూడా ఏర్పాటు చేశారు. మొక్కలు చిన్నగా ఉన్నప్పటికీ ట్రీగార్డులను ఏర్పాటు చేయడంతో ఆకట్టుకుంటున్నాయి.

'ఉపాధి హామీ బిల్లుల చెల్లింపులో జాప్యమెందుకు'

మనూరు/నాగల్‌గిద్ద: ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు 5 నెలలను కూలి డబ్బు చెల్లింపులో జాప్యం ఎందుకు జరుగుతుందని వ్యవసాయకార్మికసంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో మల్లేశ్వర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇంకుడు గుంతలు, హరితహారం మొక్కలు నాటడానికి తవ్విన గుంతల కూలి డబ్బు 5 నెలల నుంచి ఇవ్వడం లేదని కూలీలు ఎలా జీవనం కొనసాగిస్తారన్నారు. అధికారులు స్పందించి కూలి డబ్బు చెల్లించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

జహీరాబాద్ సినిమాలు

మోహన్	ఫిదా
సినీమ్యాక్స్	నేనే రాజు, నేనే మంత్రి
అనురాగ్	జయ జానకి నాయక

ఆంధ్రజ్యోతి

జహీరాబాద్

సంగారెడ్డి • మంగళవారం 22 ఆగస్టు 2017

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

- వేసిన కొన్నాళ్లకే గుంతలు
- ఇబ్బందుల్లో వాహనచోదకులు



దెబ్బతిన్న చీలపల్లి-రుక్మాపూర్‌తండా తారు రోడ్డు

ఝరాసంగం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సౌకర్యార్థం కోసం రోడ్లను వేసేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తుంది. పనులను చేపట్టే సమయంలో కాంట్రాక్టర్ నాణ్యత పాటించకపోవడంతో వేసిన కొన్నాళ్లకే కంకర తేలి దర్శనమిస్తున్నాయి. పది కాలాల పాటు ఉండాల్సిన రోడ్లు అప్పుడే దెబ్బతింటున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు, వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల పరిధిలోని చీలేపల్లి చౌరస్తా నుంచి రుక్మాపూర్ వరకు 1.90కోట్ల రూపాయలతో 4 కిలోమీటర్ల మేర 2014సంవత్సరంలో రోడ్డును వేశారు. ఈ రోడ్డు వేసే సమయంలో నాణ్యత పాటించకపోవడంతో వేసిన కొన్నాళ్లకే దెబ్బతింది. ఈ రోడ్డుపై నుంచి భారీ వాహనాలు రాకపోకల నిషేధం ఉంది. పీడబ్ల్యుడీ రోడ్డుపై ఓవర్ లోడ్ లారీలు తిరిగితే చర్యలు తీసుకుంటామని అక్కడక్కడ బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో భారీ వాహనాలు తిరిగి రోడ్డు గుంతలమయంగా మారింది. అదే విధంగా ఝరాసంగం నుంచి రెండు కిలోమీటర్ల మేర సిద్దాపూర్, వనంపల్లి గ్రామాలకు వెళ్లే తారురోడ్డుపై గుంతలు ఏర్పడినాయి. వర్షాలు కురిసినప్పుడు గుంతల్లో నీరు నిల్వడంతో వాహనదారులకు గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఝరాసంగం నుంచి చీలపల్లి గ్రామానికి వెళ్లే ఒక కిలోమీటర్ రోడ్డుపై నుంచి ఇసుక లారీలు పరిమితికి మించి తిరగడంతో కంకర తేలింది. గుంతమర్పల్లి గ్రామానికి కొద్దిదూరం నుంచి కప్పాడ్, కంకోల్ ప్రధాన రహదారి వరకు రెండు కిలోమీటర్ల మేరకు పూర్తిగా రోడ్డు దెబ్బతిని కంకర తేలింది. ఈ రోడ్డుపై నుంచి ప్రతి రోజు వివిధ పనుల నిమిత్తం ఝరాసంగం, కుప్పానగర్, బర్దిపూర్, నర్సాపూర్, కొల్లూర్ గ్రామాలకు చెందిన ప్రజలు సంగారెడ్డి, హైదరాబాద్ పట్టణాలకు వెళ్తుంటారు. రాత్రి వేళలో ఈ రోడ్డుపై రావాలంటేనే వాహనచోదకులకు నరకయాతన తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండలంలో అధ్వానంగా మారిన తారు రోడ్లను బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డును బాగు చేయించాలి



చీలపల్లి చౌరస్తా నుంచి రుక్మాపూర్‌తండా వరకు మూడు సంవత్సరాల క్రితం తారు రోడ్డును వేశారు. ఈ రోడ్డుపై నుంచి ఇసుక లారీలు తిరగడంతో పూర్తిగా దెబ్బతింది. భారీ వాహనాలు తిరిగితే జరిమానాలు విధిస్తామని అధికారులు బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

-చంద్రశేఖర్, చీలపల్లితండా

‘గ్రామాల్లో సర్వేలు నిర్వహించండి’

రాయికోడ్: ఆయా గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణంపై సర్వేలు నిర్వహించాలని ఎంపీడీవో స్టీవెన్‌నీల్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని ఎంపీపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మరుగుదొడ్లు నిర్మించుకున్న, నిర్మించుకోని, గ్రామాల్లో ఉండని వారి పేర్ల వివరాలను సేకరించాలని ఆయన సూచించారు. మరుగుదొడ్లు నిర్మించుకునేటట్లు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. వాటర్ ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్‌ను వేసి శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సుభాష్, సీనియర్ అసిస్టెంట్ నరేందర్, కార్యదర్శులు సంగయ్యస్వామి, సంగయ్య, దుర్గయ్య, షాదుల్లా, లక్ష్మణ్, ఎల్లయ్య, అనిత, సంగారెడ్డి, రాజేందర్‌పాటిల్ ఉన్నారు.

‘తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి’



తహసీల్దార్ గీతకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

జహీరాబాద్: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ నాయకులు స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్లు చేసిన నాయకులు ప్రస్తుతం నోరు మెదపడం లేదన్నారు. ఇప్పటికైనా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జహీరాబాద్ మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు అశోక్, పూలసంతోశ్, తుక్కారెడ్డి, రాజేశ్, శంకర్‌యాదవ్, బక్కన్న, నరేశ్ యాదవ్ పాల్గొన్నారు.

‘నేటి భూనిర్వాసితుల సదస్సును జయప్రదం చేయాలి’

జహీరాబాద్: నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండలంలో నిమ్జ్ భూములు తీసుకోవడానికి గుర్తించిన గ్రామాల్లో 17 గ్రామ పంచాయతీ అధికారాలను టీఎస్‌ఐఐసీకి బదలాయించాలనే మెమోకు వ్యతిరేకంగా ఈ నెల 22వ తేదీన న్యాల్‌కల్ మండలం గంగ్వార్ చౌరస్తా వద్ద జరిగే సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆల్ ఇండియా కిసాన్ సభ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే 1044 మెమోను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి.వెంకట్, రాంచందర్ ఉన్నారు.

ఘనంగా రాచన్నస్వామి పల్లకీసేవ

కోహీర్: మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల శ్రీరాచన్న స్వామి ఆలయంలో సోమవారం శ్రావణమాసం చివరి రోజున స్వామి పల్లకీసేవను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం స్వామివారికి మహాపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం లక్షబిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం రోజున లక్షబిల్వార్చన కార్యక్రమం పూర్తవుతుందని ఆలయ ఈవో శివరుద్రప్ప తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శంకర్, దయానంద్‌పాటిల్, రఘుపతిరెడ్డి, రాజన్న, రాచన్న, శ్రీపాల్, శివానంద్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమం

కోహీర్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నాలుగు రోజులుగా ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్‌వాడీ కేంద్రాల్లో 15సంవత్సరాలలోపు పిల్లలకు తట్టు, రుబెల్లా వ్యాక్సిన్ వేస్తున్నారు. సోమవారం మండల కేంద్రమైన కోహీర్‌తో పాటు ఆయా గ్రామాల్లో పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేశారు. నాలుగు రోజులుగా 6వేల మంది పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేయడం జరిగిందని డాక్టర్ శ్రీధర్ తెలిపారు.

కేతకీ ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

ఝరాసంగం: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీకేతకీ సంగమేశ్వరస్వామి ఆలయం శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా భక్తులతో కిక్కిరిసింది. ఆదివారం రాత్రి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ మండపంలో భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమాలను నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో గల మండపంలో భక్తులు అధిక సంఖ్యలో సామూహిక, అభిషేక కార్యక్రమాలను చేపట్టారు. ఆలయ ఆవరణలో గల నవగ్రహాలకు తైలం, నల్లవస్త్రంతో పూజలను చేపట్టారు. ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, సిబ్బంది, స్థానిక ఎస్ఐ లవకుమార్, పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు చేపట్టారు. శ్రావణం చివరి రోజు సందర్భంగా జహీరాబాద్ డిపో నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడిపారు. అదే విధంగా మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామ శివారులో గల రేవణసిద్ధేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం ముగింపు కార్యక్రమాలు చేపట్టారు. బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆశ్రమంలోని నవగ్రహాలకు, పంచవృక్షాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులను తీర్చుకున్నారు. దత్తగిరి ఆశ్రమానికి బాల్కి మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌ఖండ్రే కుటుంబసమేతంగా తరలివచ్చి ఆశ్రమంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆశ్రమానికి తరలివచ్చిన భక్తులకు వైరాగ్య శిఖామణి అవదూతగిరి మహారాజ్ తీర్థప్రసాదాలను అందజేశారు.



కేతకీ ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తజనం

ఆలయంలో జహీరాబాద్ డీఎస్పీ పూజలు

మండల కేంద్రమైన ఝరాసంగంలోని శ్రీకేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అమవాస్య సందర్భంగా జహీరాబాద్ డీఎస్పీ నల్లమలరవి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనచే అభిషేక కార్యక్రమాలను చేయించారు. ఆలయానికి వచ్చిన భక్తుల రద్దీపై స్థానిక ఎస్ఐ లవకుమార్, ఆలయ ఈవో మోహన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని వారికి ఆదేశించారు.

రాయికోడ్‌లో

రాయికోడ్: మండల కేంద్రమైన రాయికోడ్‌తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో శ్రావణ చివరి సోమవారం సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన రాయికోడ్‌లోని భద్రకాళిసమేత శ్రీవీరభద్రేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, లక్షబిల్వార్చన, మహారుద్రాభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మన రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు

న్యాల్‌కల్‌లో

న్యాల్‌కల్: రేజింతల్ గ్రామ శివారులో గల శ్రీసిద్ధివినాయక ఆలయంలో సోమవారం శ్రావణమాసం చివరి రోజు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు మన ప్రాంతం నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

టీడీపీలో చేరిన 100మంది యువకులు

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలోని 9, 10వార్డులకు చెందిన 100మంది యువకులు టీడీపీలో చేరినట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వై.నరోత్తం తెలిపారు. సోమవారం ఉత్తమ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో వారు చేరినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నరోత్తం మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే యువకులు టీడీపీ పార్టీలో చేరారన్నారు. పార్టీలో చేరిన వారిలో నబీ, అమీర్, అడ్డు, అబ్దుల్‌బారి, అమీర్‌అలీ, ఎండీ షకీల్, ఎండీ పుర్కాన్, అబ్దుల్, ఆసీఫ్, ఫయాజ్‌ఖాన్, ఎండీ మోసీన్, ఫారూక్, వాజిద్, శ్రీకాంత్, రాజశేఖర్‌లు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు క్రిష్ణయ్య, శ్రీకాంత్, మసూద్‌హుస్సేన్, రాంచందర్, అమీన్, జగన్, వీర్‌సంగప్ప, సోయల్, అమీర్, కిష్టన్న పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన యువకులతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరోత్తం

నేడు బ్యాంకులు బంద్

కోహీర్: బ్యాంక్ ఉద్యోగుల సంఘాల ఐక్య వేదిక (యూఎఫ్‌బీయూ) ఇచ్చిన పిలుపుమేరకు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న బ్యాంకుల ఉద్యోగులు సమ్మెలో పాల్గొనన్నట్లు పలు బ్యాంకుల అధికారులు తెలిపారు.

ఘనంగా రుద్రాభిషేకం, బిళ్వార్చన

న్యాల్‌కల్: న్యాల్‌కల్‌లోని రామలింగేశ్వర ఆలయంలో శ్రావణమాసం ప్రారంభం నుంచి శ్రావణమాసం ముగింపు సోమవారం వరకు ప్రతి రోజు రుద్రాభిషేకం, బిళ్వార్చన కార్యక్రమాలను నిర్వహించారు.

జనపదమే..జానపదం

శ్రమ జీవులు పనిలో అలసిపోయినప్పుడు దాన్ని మరిచిపోయేందుకు పాటను బాణీలతో కైకట్టుకొని జానపదాన్ని సృష్టించారు. అలా జనపదమే జానపదమైంది. దుక్కిదున్నినప్పుడు.. మోట కొట్టినప్పుడు.. నాట్లు వేసినప్పుడు.. పంట కోసినప్పుడు.. ఒక్కో సందర్భంలో ఒక్కో పాట పుట్టింది. పల్లకీ మోసే బోయలు ఆ బరువును మరిచిపోయేందుకు ఓహోఓహోఓం.. ఓహోఓహో.. అంటు పాడిన పాట జానపదమైంది. కొండల్లో కోనల్లో నివసించే కోయలు, గోండులు, చెంచులు రేలారే.. రేలా అన్న పదాలు పాటలుగా మారాయి. వడ్లు దంచుతున్నప్పుడు వచ్చే సుయ్..సుయ్ అనే శబ్ధం సువ్వి..సువ్వి.. సువ్వన్నాలారా అనే సువ్వి పాటగా మారింది. కాలక్రమేణ జానపదం ప్రతి విషయంలో భాగమైంది. ఉద్యమంలో గళమెత్తింది. వినోదంగా మారి ఆనందాన్నిచ్చింది. ఈ కళకు ప్రత్యేక పేరొచ్చింది. ఎల్లలు దాటింది. ప్రపంచంలోనే గుర్తింపు వచ్చింది. అయితే నేడు కళను నమ్ముకున్న కళాకారుల పరిస్థితి దారుణంగా మారింది.

- తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రధాన పాత్ర పోషించిన కళాకారులు
- ఉద్యమంలో పాల్గొన్నా కొందరికి ఉద్యోగాలు రాలేదు
- రాష్ట్రం ఆవిర్భవించాక కూడా అన్యాయమే
- జానపద దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి
- కళాకారుల విన్నపం
- నేడు ప్రపంచ జానపద కళల దినోత్సవం

హుస్నాబాద్ / సంగారెడ్డి రూరల్ : జానపదకళలు ఒకప్పుడు తెలంగాణ సంస్కృతికి నిదర్శనంగా ఉండేవి. కాలక్రమంలో వీటికి ఆదరణ తగ్గిపోయింది. దేశంలో ఏ ఉద్యమం మొదలైనా దానికి జానపద కళాకారులు తమ కళతో ప్రాణం పోసేవారు. తెలంగాణ ఉద్యమంలోనూ తమదైన శైలిలో పాటలు, నాటకాల రూపంలో పోరాటాలు చేశారు. కానీ రాష్ట్రం ఏర్పడ్డాక తమని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను కళాకారులుగా గుర్తించి ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతున్నారు.



పల్లెల్లో పుట్టిన కళ

జానపద పాట పుట్టింది పల్లెల్లో. పురుడు పోసుకుంది జనం సమస్యల్లో. జోల పాట, లాలి పాట, ఈల పాట, నారుపాట, నాట్లపాట, కన్నీరు పాట, అప్పగింతల పాట, కరువు పాటలే కాకుండా అనేక చైతన్యభరితమైన పాటలు జానపదం నుంచి వచ్చినవే. రాజుల జయించిన విజయాలు, గాథలను, స్వాతంత్ర్య సమరయోదులు, దేశ చరిత్ర, రాజకీయాలపై అనేక సందర్భాల్లో చరిత్రకనుగుణంగా కథలు, పాటల రూపంలో కళ్లకు కట్టినట్టు చూపించే నైపుణ్యత జానపద కళాకారులకు ఉంది.

తెలంగాణ సాయుధ పోరాటం నుంచి

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో జానపదాలు ప్రధాన భూమిక పోషించింది. నిజాం నిరంకుశ విధానాలను ఎండగడుతూ ఉద్యమ కారులు, కళాకారులు బుర్రకథలు, జానపద పాటలు, గొల్లసుద్దుల వంటి కళారూపాలతో ప్రజలను చైతన్యం రగిలించారు.. ఉద్యమం వైపు నడిపించారు. అప్పుడు ప్రజలను ఉద్యమంలో ఏకం చేసింది పాటలే. నక్సల్బరీ ఉద్యమంలో కూడా పాటనే ప్రముఖ పాత్ర పోషించిది. ఉవ్వెత్తున లేచిన తెలంగాణ మలిదశ ఉద్యమానికి పాటలు, కళారూపాలే జీవం పోశాయి. ప్రజలను కదిలించాయి. తెలంగాణ రాష్ట్ర సాధనకు బాటలు వేశాయి.

జానపదంలో 31రకాల కళలు

జానపద కళల్లో సుమారు 31 కళలున్నాయి. సాధన శూరులు, పాండవుల వారు, భజనలు, కోలాటాలు, బాగోతాలు, జడ కోలాటం, పీరీలు, గుస్సాడీ, జింసా, మద్దెల దరువు, లంబాడి, పోతరాజులు, జమడిక, బైండ్ల, పాంబాల, డప్పు నృత్యాలు వంటి కళారూపాలున్నాయి. చిందుయక్షగానం, చిరుదలభజన, చెక్కభజన, సాధనసురులు, శారదకాళ్లు, సర్కస్ కళలతో పాటు మాష్టికళాకారులు, బహురూప కళాకారులు, బాలసంతు, భజనకీర్తనలు, ఏర్పుల, బుర్రకథలు, హరిదాసుకథలు, ఒగ్గుకథ, ఎరుకసోది, కోలాట జెడకొవ్వులు, పిట్టపంచాంగం, లంబాడి నృత్యాలు, పల్లె గాయకులు, నాటక ప్రదర్శన ఇచ్చేవారితో పాటు మరికొందరు ఈ జానపద కళాకారుల కోవకే వస్తారు.

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు

మిద్దెరాములు, చుక్క సత్తయ్య వంటి వారు ఒగ్గుకథకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారు. తెలంగాణ ఉద్యమం చాలా మంది కళాకారులను వెలుగులోకి తెచ్చింది. తెలంగాణ రాష్ట్ర సాధనలో కళాకారులు ముఖ్యపాత్ర పోషించారు. ధూంధాం కార్యక్రమాలతో ప్రజలను ఉద్యమాల వైపు నడిపించారు. గతంలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడానికి కళాకారులను వినియోగించుకునేది. ఉద్యమంలో కళాకారులను పాత్రను గుర్తించిన టీఆర్ఎస్ ప్రభుత్వం 500 మంది కళాకారులకు ఉద్యోగాలిచ్చింది. అయితే తెలంగాణ ఉద్యమంలో ఆటపాటలతో చైతన్య పరిచిన అర్హులైన కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వలేదనే విమర్శలున్నాయి. అప్పుడు ఉద్యమంలో భాగస్వాములైన అనేక మంది కళాకారులు ప్రస్తుతం ఇటు కళా ప్రదర్శనలు లేక,అటు ఉద్యోగాలు రాక కష్టతరంగా జీవనం గడుపుతున్నారు.

ఉద్యమంలో భాగమైనా ఉద్యోగాల్లేవు

తెలంగాణ ఉద్యమంలో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చిన తమకు ఉద్యోగాలు రాలేదని హుస్నాబాద్‌కు చెందిన కళాకారులు తిప్పర్తి శ్రీనివాస్, గద్ద సంపత్, కొడముంజ రవీందర్ తెలిపారు. మొదట తమకు ఉద్యోగాల కోసం కాల్ లెటర్ వచ్చాయని ఆ తరువాత ఉద్యోగాలు ఇవ్వలేదని గద్ద సంపత్ తెలిపారు. తనకు కాల్ లెటర్, ఉద్యోగం కోసం అపాయిట్‌మెంట్ లెటర్ ఇచ్చి కూడ ఉద్యోగంలోకి తీసుకోలేదని తిప్పర్తి శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటికైనా తమకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

వీరి డిమాండ్లు ఇవే

- కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలి. ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలి.
- ఇళ్లు, స్థలాలు లేని వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలి.
- ప్రమాద బీమా కింద రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. హెల్త్ కార్డులు ఇవ్వాలి.
- కళాకారుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్య అందించాలి.
- వృద్ధ కళాకారులకు రూ.3 వేల పింఛన్ ఇవ్వాలి. జీవన భృతి కల్పించాలి.
- జానపద ఆడిటోరియం నిర్మించి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి.
- ప్రపంచ జానపద దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి.

జానపద కళను బతికించండి



జానపద కళలు మరుగునపడి కళాకారులు ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది కూలీ పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన జానపద కళాకారులను గుర్తించకుండా అప్పుడే పుట్టిన ధూంధాం కళాకారులను మాత్రమే ప్రభుత్వం కళాకారులుగా గుర్తించి ప్రోత్సాహకాలు అందించింది. తెలంగాణ రాష్ట్రం వచ్చినా జానపదకళాకారులకు అన్యాయమే జరిగింది. సీఎం కేసీఆర్ కళాకారులను గుర్తించి ప్రోత్సహించాలి. కళను బతికించాలి.

- ఎల్లయ్య, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారులు సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు



తమను ఆదుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ మాణిక్యరాజ్ కన్నన్‌కు వినతి పత్రం అందజేస్తున్న కళాకారులు (ఫైల్)

ఉల్లాసం ఉరకలేసింది. ఉత్సాహం ఉప్పొంగింది. క్రీడాకారుల విన్యాసాలు ఆకర్షించాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మొత్తానికి వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన క్లస్టర్ లెవెల్ బాల్‌గేమ్స్ ఆరంభం వేడుకలు అదిరాయి. వివిధ జిల్లాల నవోదయ విద్యార్థులు పలు క్రీడాంశాల్లో తమ సత్తాను చాటారు. క్రీడాకారుల కవాతు.. గౌరవ వందనాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథి నవోదయ విద్యాలయాల సమితి మాజీ డిప్యూటీ కమిషనర్ శఠగోపన్ ప్రసంగం అందరిలో ప్రేరణ కలిగించింది.

ఆరంభ వేడుక అదిరింది



జ్యోతిని వెలిగిస్తున్న ముఖ్యఅతిథులు

- వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో ఘనంగా ప్రారంభమైన క్లస్టర్ లెవెల్ బాల్‌గేమ్స్
- పాల్గొన్న రాష్ట్రంలోని వివిధ నవోదయ విద్యాలయాల విద్యార్థులు
- అట్టహాసంగా సాగిన క్రీడాపోటీలు
- ముఖ్య అతిథిగా హాజరైన నవోదయ విద్యాలయాల సమితి మాజీ డిప్యూటీ కమిషనర్ శఠగోపన్

వర్గల్ : స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో క్లస్టర్ లెవెల్ బాల్‌గేమ్స్ సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థుల కేరింతలు, అరుపులు, చప్పట్లు, కేకల మధ్యన విద్యాలయం ప్రాంగణం మార్మోగింది. ఉత్సాహ వాతారవణంలో నవోదయలో క్రీడోత్సవం ఆరంభమైంది. ఈ ప్రారంభ వేడుకలకు ముఖ్య అతిథిగా నవోదయ విద్యాలయాల సమితి మాజీ డిప్యూటీ కమిషనర్ శఠగోపన్ హాజరయ్యారు. ముందుగా రాష్ట్రంలోని 9 జిల్లాల నవోదయ విద్యాలయాల నుంచి వచ్చిన క్రీడాకారులు కవాతు నిర్వహించి ముఖ్యఅతిథులకు గౌరవ వందన చేశారు. అనంతరం ముఖ్య అతిథులు క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శఠగోపన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న నవోదయ విద్యాలయాలకు కేంద్ర ప్రభుత్వం అందిచే ప్రోత్సాహకం ఎంతో బాగుందన్నారు. నవోదయ విద్యాసంస్థలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎంతో గుర్తింపు ఉందన్నారు. నవోదయాల్లో విద్యార్థుల చదువులు, క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోనే వారు మంచి ప్రతిభావంతులు అవుతున్నారన్నారు. నవోదయ విద్యార్థుల్లో చాలామంది ఉన్నత స్థాయిల్లో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం నవోదయ విద్యాలయాలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందన్నారు. అనంతరం వేదికపై ఆరో తరగతి విద్యార్థిని దీప్తి చేసిన భరతనాట్యం ఆకట్టుకుంది. అలాగే విద్యార్థులు బోనాల నృత్యాలు చేసి అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం ఆట స్థలంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల క్రీడా పోటీలు ప్రారంభించారు. హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ తదితర ఆటల్లో విద్యార్థులు తమ ప్రతిభ చాటారు.



హ్యాండ్‌బాల్ ఆడుతున్న విద్యార్థులు

ఈ కార్యక్రమంలో నవోదయ విద్యాలయ సమితి మాజీ అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఎస్‌రెడ్డి, జడ్పీటీసీ అయ్యగాల్ల పోచయ్య, ఎస్ఐ శ్రీధర్, ప్రిన్సిపాల్ వెంకటరమణ, వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వర్‌రావుతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన కోచ్‌లు పాల్గొన్నారు.



బాస్కెట్‌బాల్ ఆడుతున్న విద్యార్థులు



భరత నాట్యం చేస్తున్న విద్యార్థిని దీప్తి



గౌరవ వందనం చేస్తున్న విద్యార్థులు



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థినులు



బతుకమ్మ పాటకు నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పత్రికా పఠనంతో భాషపై పట్టు

- గీతం విశ్వవిద్యాలయం హైదరాబాద్ ప్రాంగణంలో సివిల్ సర్వీసెస్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్‌పై అవగాహన
- ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు డాక్టర్ బి.ప్రసాదరావు



మాట్లాడుతున్న ప్రసాదరావు

పటాన్‌చెరు రూరల్ : పత్రికా పఠనం వల్ల భాషపై పట్టు సాధించవచ్చని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు డాక్టర్ బి.ప్రసాదరావు అన్నారు. గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ప్రాంగణంలో సివిల్ సర్వీసెస్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్ అనే అంశంపై సోమవారం ఆయన ప్రసగించారు. విద్యార్థులు రోజూ పత్రికా పఠనం చేయాలని, అదే ప్రగతికి సోపానంగా మారుతుందని పేర్కొన్నారు. ఆసక్తిని బట్టి తెలుగు లేదా ఇంగ్లిష్ పేపర్లు చదవాలని సూచిచారు. ఇది భావ వ్యక్తీకరణకు తోడ్పడుతుందన్నారు. సామాజిక, వర్తమాన అంశాలపై అవగాహన పెంపొందుతుందన్నారు. సంపాదకీయాలను (ఎడిటోరియల్స్) చదవడం వల్ల లోతైన విశ్లేషణతో పాటు ఆయా అంశాలపై సంపూర్ణ అవగాహన ఏర్పడుతుందని చెప్పారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాయాలని చాలామంది విద్యార్థులు ఉత్సుకతతో ఉంటారని, అందుకు ప్రణాళికతో చదవాలని సూచించారు. పోటీపరీక్షలకు విద్యా పరిశోధన, శిక్షణ జాతీయ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) 8 నుంచి 12వ వరకు పుస్తకాలను చదివితే ప్రయోజనం ఉంటుందన్నారు. సివిల్ సర్వీస్‌లో ఉద్యోగం పొందడం వల్ల సమాజ సేవ చేసే అవకాశంతో పాటు గౌరవ మర్యాదలు లభిస్తాయని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు దేహదారుఢ్యాన్ని పెంపొందించుకోవడానికి కూడా కొంత సమయం వెచ్చించాలని సూచించారు. పరిశోధనపై ఆసక్తి ఉన్న విద్యార్థులు కొంత సమయం దానికి కేటాయించాలని, అభిరుచితో పరిశోధిస్తే మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చనిపోయినప్పుడు తన వృత్తి జీవితంలో అత్యంత క్లిష్ట పరిస్థితులను చవిచూశానని ఆయన చెప్పారు. అప్పటి ప్రధాని, కాంగ్రెస్ అధ్యక్షురాలు, ఆరేడుగురు ముఖ్యమంత్రులు వైఎస్‌కు నివాళులు అర్పించడానికి వచ్చారని, అదేరోజు జంటనగరాలలో వినాయ నిమజ్జనం ఉండడంతో చాలా ఆందోళనకు గురికావాల్సి వచ్చిందని గుర్తు చేసుకున్నారు. సమన్వయంతో పనిచేయడం ద్వారా అంతా ప్రశాంతంగా ముగిసిపోయేట్టు చూశామని వివరించారు. నిబద్ధతతో పనిచేసిన అధికారుల వల్లే అది సాధ్యపడిందన్నారు. అంతకుముందు గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, గీతం హాస్టల్స్ చీఫ్ వార్డెన్ ఆయనను సత్కరించారు.



ప్రసాదరావుకు ఆహ్వానం పలుకుతున్న గీతం విద్యార్థిని

India's largest trade partner?

Current Affairs & GK



A. Ravi Prakash Reddy
Senior Faculty

1. Justice Deepak Mishra, 45th Chief Justice of India, will assume office on…..
1) 27 August 2017 2) 28 August 2017
3) 29 August 2017 4) 30 August 2017
5) 31 August 2017

2. Who is the President of Kenya re-elected for second term in the August 2017 general elections?
1) Uhuru Kenyatta
2) Muhammadu Buhari 3) Jacob Zuma
4) Robert Mugabe 5) None of these

3. Ruth Pfau, popularly known as Pakistan's Mother Teresa has passed away. She hailed from which country?
1) Switzerland 2) South Sudan
3) South Africa 4) Saudi Arabia
5) Germany

4. Name the countries for first time are going to conduct Indra tri-services exercise, involving their armies, navies and the air forces in October 2017 to further ramp up military ties?
1) India and USA 2) India and UK
3) India and Russia 4) India and China
5) India and Japan

5. Usain Bolt announced retirement to athletics recently. He is widely considered to be the greatest sprinter of all time. He belongs to ……
1) Jamaica 2) Kenya 3) Zimbabwe
4) Brazil 5) None of these

6. Who was served as the Returning Officer for the 15th Presidential election held on 17 July 2017?
1) Anoop Mishra 2) Shumsher K. Sheriff
3) Hamid Ansari 4) Sumitra Mahajan
5) None of the above

7. Which of the following lines forms border between North Korea and South Korea?
1) 18th Parallel north
2) 28th Parallel north
3) 38th Parallel north
4) 48th Parallel north
5) None of the above

8. Which of the following statements correct regarding Asian Infrastructure Investment Bank (AIIB)?
1) AIIB started operation after the agreement entered into force on 25 December 2015 and opened for business on 16 January 2016.
2) The Headquarters of AIIB is in Beijing, China.
3) Jin Liqun (China) is currently President of AIIB.
4) AIIB is an multilateral development bank that aims to support the building of infrastructure in the Asia-Pacific region.
5) All of the above

9. Which of the following bank has introduced biometric attendance in the place of the existing system of signing attendance in the attendance register?
1) State Bank of India
2) Punjab National Bank
3) Corporation Bank
4) Bank of India 5) None of these

10. The Senior IAS officer from Gujarat S. Aparna is appointed as Executive Director of the …….
1) World Bank
2) International Monetary Fund
3) World Trade Organisation
4) SAARC 5) None of these

11. Who defeated China's Zulpikar Maimaitiali in the unified WBO Asia Pacific and Oriental Super Middle weight title?
1) Vijender Singh 2) Manoj Kumar
3) Jitender Kumar 4) Gurcharan Singh
5) None of these

12. Match the following?

Author	Book
A. Y.V.Reddy	(i) A Life in Science
B. C.N.R.Rao	(ii) Advice and Descent : My Life in Public Service
C. Arundhati Roy	(iii) Matoshree
D. Sumitra Mahajan	(iv) The Ministry of Utmost Happiness

	A	B	C	D
1)	(i)	(ii)	(iii)	(iv)
2)	(iv)	(iii)	(ii)	(i)
3)	(i)	(iii)	(ii)	(iv)
4)	(ii)	(i)	(iv)	(iii)
5)	(iv)	(i)	(iii)	(ii)

13. The 75th anniversary of the Quit India Movement was observed across the country on ……
1) 7th August 2017 2) 8th August 2017
3) 9th August 2017 4) 10th August 2017
5) None of these

FOR ALL COMPETITIVE EXAMS

14. The Eighth Mekong-Ganga Cooperation Ministerial Meeting (8th MGCMM) was held on 7 August 2017 in..
1) Manila, Philippines
2) Bangkok, Thailand 3) Hanoi, Vietnam
4) Phnom Penh, Cambodia
5) None of these

15. Find the Arundhati Roy's first novel?
1) The God of Small Things
2) The End of Imagination
3) The Cost of Living
4) The Greater Common Good
5) The Algebra of Infinite Justice

16. Usain Bolt, greatest sprinter, belongs to …..
1) South Africa 2) South Sudan
3) South Korea 4) Sierra Leone
5) None of these

17. World's largest Crude Oil importer?
1) China 2) USA 3) India 4) Japan
5) None of these

18. World's largest Crude Oil exporter?
1) Saudi Arabia 2) Russia 3) Iraq
4) Canada 5) None of these

19. India's largest trade partner?
1) China 2) USA 3) UAE
4) Saudi Arabia 5) None of these

20. NABARD has conferred the 'best performance award' for 2016-17 to which regional rural bank?
1) Andhra Pragathi Grameena Bank
2) Karnataka Vikas Grameena Bank
3) Telangana Grameena Bank
4) Kaveri Grameena Bank
5) None of these

21. Who is the author of book "The Adivasi Will Not Dance"?
1) Arundhati Roy
2) Hansda Sowvendra Shekhar
3) Chetan Bhagat 4) Amitav Ghosh
5) None of these

22. Which state has the highest number of elephants, as per the Elephant census report 2017, released by the Union Ministry of Environment, Forests and Climate Change (MoEFCC)?
1) Karnataka 2) Assam 3) Kerala
4) Tamil Nadu 5) None of these

23. Who is the Union Minister for Environment, Forests and Climate Change?
1) Suresh Prabhu 2) Prakash Javadekar
3) Harsh Vardhan
4) Thawar Chand Gehlot
5) Radha Mohan Singh

24. India's Elephant population as per Elephant Census 2017 released by Union Ministry of Environment, Forests and Climate Change (MoEFCC)?
1) 27,312 2) 37,312 3) 47,312
4) 57,312 5) None of these

25. What is the nation wide campaign to protect elephants, launched by Union Ministry of Environment and Forests on the occasion of World Elephant Day observed on 12th August 2017?
1) Project Elephant
2) Project Heritage Animal
3) Project Gaja Raja 4) Gaj Yatra
5) None of these

26. Which of the following is the India's largest Regional Rural Bank (RRB)?
1) Andhra Pragathi Grameena Bank
2) Prathama Bank
3) Allahabad UP Gramin Bank
4) Maharashtra Gramin Bank
5) Kerala Gramin Bank

27. Mercosur is a sub-regional bloc between countries of which of the following continents?
1) North America
2) South America
3) Africa 4) Asia 5) None of these

28. McMohan Line represents boundary between which following two countries?
1) India and Afghanistan
2) India and Pakistan 3) India and China
4) India and Bangladesh 5) None of these

29. Which company occupies No.1 position in Fortune Global 500 list 2017, which ranks companies by their revenues in 2016?
1) Walmart 2) State Grid
3) Sinopec Group
4) China National Petroleum
5) Toyota Motors

30. How many Indian companies listed in Fortune Global 500 companies list?
1) 6 2) 7 3) 8 4) 9 5) None of these

31. SBI's rank in the Fortune Global 500 companies list?
1) 117 2) 217 3) 317 4) 417
5) None of these

32. Match the following?

Company	Country
A. Toyota Motors	(i) USA
B. Berkshire Hathaway	(ii) Germany
C. Volkswagen	(iii) South Korea
D. Samsung Electronics	(iv) France
E. AXA	(v) Japan

	A	B	C	D	E
1)	(ii)	(iii)	(iv)	(v)	(i)
2)	(iii)	(iv)	(ii)	(i)	(v)
3)	(iv)	(iii)	(i)	(ii)	(v)
4)	(i)	(ii)	(iii)	(iv)	(v)
5)	(v)	(i)	(ii)	(iii)	(iv)

33. First bank to introduce ATM in India was HSBC in…
1) 1957 2) 1967 3) 1977 4) 1987
5) None of these

Answers

1) 2 6) 1 11) 1 16) 5 22) 1 28) 3
2) 1 7) 3 12) 4 17) 1 23) 3 29) 1
3) 5 8) 5 13) 3 18) 1 24) 1 30) 2
4) 3 9) 2 14) 1 19) 1 25) 4 31) 2
5) 1 10) 1 15) 1 20) 2 26) 5 32) 5
21) 2 27) 2 33) 4

Jobs ఉద్యోగాలు

బిఇసిఐఎల్

బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బిఇసిఐఎల్) - కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 42
- **కంటెంట్ ఆడిటర్**

ఖాళీలు: 1
అర్హత: పీజీ డిప్లొమా(జర్నలిజం/ మాస్ కమ్యూనికేషన్) + విజువల్ మీడియా లేదా న్యూస్ ఏజెన్సీ(ఎఎన్ఐ/ పిటిఐ/ యుఎన్ఐ)ల్లో మూడేళ్ల అనుభవం ఉండాలి. లేదా న్యూస్ ఎడిటర్/ డిప్యూటీ డైరెక్టర్ (న్యూస్) గా పనిచేసి రిటైర్ అయి ఉండాలి.
- **సీనియర్ మానిటర్**

ఖాళీలు: 3
అర్హత: పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం ఉత్తీర్ణత + మీడియా / న్యూస్ ఏజెన్సీల్లో రెండేళ్ల అనుభవం ఉండాలి. లేదా న్యూస్ ఎడిటర్/ అసిస్టెంట్ డైరెక్టర్(న్యూస్) గా పనిచేసి రిటైర్ అయి ఉండాలి.
- **మానిటర్**

ఖాళీలు: 38
అర్హత: గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత + కంప్యూటర్ పరిజ్ఞానం + ప్రాంతీయ భాషల్లో ప్రావీణ్యం ఉండాలి. పీజీ డిప్లొమా(జర్నలిజం)/డిగ్రీ(జర్నలిజం / మాస్ కమ్యూనికేషన్) పూర్తిచేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: రూ.300
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
వెబ్‌సైట్: www.becil.com

సిఎస్ఐఆర్ నెట్

కౌన్సెల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సిఎస్ఐఆర్)- నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్)కు ప్రకటన విడుదల చేసింది.
విభాగాలు: కెమికల్ సైన్సెస్/ ఎర్త్, అట్మాస్ఫియరిక్/ ఓషన్/ ప్లానెటరీ సైన్సెస్/ లైఫ్ సైన్సెస్/ మేథమెటికల్ సైన్సెస్/ ఫిజికల్ సైన్సెస్
అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఎమ్మెస్సీ / తత్సమాన పరీక్ష/ ఇంటిగ్రేటెడ్ బిఎస్- ఎంఎస్/ నాలుగేళ్ల బిఇ/ బిటెక్/ బిఫార్మసీ/ ఎంబిబిఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: జెఆర్ఎఫ్‌లకు జూలై 1 నాటికి 28 ఏళ్లు మించరాదు. లెక్చరర్‌షిప్‌నకు వయోపరిమితి నిబంధన లేదు.
సిఎస్ఐఆర్ - యుజిసి టెస్ట్ జరిగే తేదీ: డిసెంబరు 17
పరీక్ష కేంద్రాలు: గుంటూరు, హైదరాబాద్
పరీక్ష ఫీజు: రూ.1000(ఒబిసిలకు రూ.500, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.)
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 23 నుంచి
ఫీజు డిపాజిట్‌కు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
ఆన్‌లైన్ దరఖాస్తునకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 16
ఆన్‌లైన్ దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 23
వెబ్‌సైట్: www.csirhrdg.res.in

పీజెటిఎస్ఎయు

హైదరాబాద్, రాజేంద్ర నగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ (పీజెటిఎస్ఎయు)- **అసిస్టెంట్ ప్రొఫెసర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 224
విభాగాలు: అగ్రికల్చర్ 186(6 పోస్టులను లైబ్రరీ సైన్స్‌కు కేటాయించారు), అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ 22, హోం సైన్స్ 16
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 20
దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 29
వెబ్‌సైట్: www.pjtsau.ac.in

బల్బులోని ఫిలమెంటును దేనితో తయారు చేస్తారు?


విద్యుత్

1. విద్యుత్ ప్రవాహం ------
ఎ) సదిశ రాశి బి) అదిశ రాశి
సి) ఎ, బి డి) ఎ, బి లు కావు
2. ఓం, వెబ్ ఓంల మధ్య సంబంధం?
ఎ) 1 Ω = 10^{10} ab Ω బి) 1 Ω = 10^{8} ab Ω
సి) 1 Ω = 10^{9} ab Ω డి) 1 Ω = 10^{7} ab Ω
3. మూడు నిరోధాలను శ్రేణిలో కలిపితే ఫలిత నిరోధం R_1, సమాంతరంగా కలిపితే ఫలిత నిరోధం R_2 అయితే R_1 / R_2 విలువ?
ఎ) 3 బి) 9 సి) 1/9 డి) 1/3
4. ఒక ఆదర్శ అమ్మీటర్ నిరోధం?
ఎ) సున్నా బి) అనంతం సి) 1000 Ω డి) 10 Ω
5. ఓం నియమం అనువర్తించకూడనిది?
ఎ) ఎసి వలయం
బి) అధిక ఉష్ణోగ్రత ఉన్న వాహకాలు
సి) వాహకాలు డి) అర్ధ వాహకాలు
6. ఒక నిరోధం పొడవును రెట్టింపు చేస్తే నిరోధం?
ఎ) సగమవుతుంది బి) రెట్టింపవుతుంది
సి) నాలుగోవంతవుతుంది డి) మారదు
7. ప్రామాణిక నిరోధాలు తయారుచేయడానికి వాడే పదార్థం?
ఎ) రాగి బి) కాన్‌స్టంటన్ సి) వెండి డి) టంగ్‌స్టన్
8. 1 KWH విలువ =
ఎ) 36 x 10^{5} J బి) 36 x 10^{5} ev
సి) 36 x 10^{6} J డి) 36 x 10^{3} J
9. వివిధ సంయోగాలతో రెండు ఫలిత నిరోధాలు 18 Ω, 4 Ω . అయితే ఆ నిరోధాలు Ω లలో
ఎ) 9, 9 బి) 11, 7 సి) 6, 12 డి) 10, 8
10. ఒక వాహకం ద్వారా 0.5 ఆంపియర్ విద్యుత్ ప్రవహిస్తుంది. అయితే ఒక నిముషంలో దాని ద్వారా ప్రవహించిన ఆవేశం?
ఎ) 3C బి) 0.3C సి) 33C డి) 30C
11. విద్యుత్ ప్రవాహం వల్ల అయస్కాంత ఫలితం కలుగుతుందని కనుగొన్నది?
ఎ) మాక్స్‌వెల్ బి) ఆయిర్‌స్టెడ్ సి) ఫెర్మి డి) ఫ్లెమింగ్
12. ప్రేరిత విద్యుచ్ఛాలక బలం దిశను తెలుసుకోవడానికి ఉపయోగించే నియమం?
ఎ) ఆంపియర్ ఎడమచేతి నిబంధన
బి) మాక్స్‌వెల్ నిబంధన
సి) ఫ్లెమింగ్ ఎడమచేతి నిబంధన
డి) ఫ్లెమింగ్ కుడి చేతి నిబంధన
13. స్వయం ప్రేరణ గుణకానికి, అన్యోన్య ప్రేరణ గుణకానికి ఎస్ఐ ప్రమాణాలు వరసగా?
ఎ) హెన్రీ, ఫారడ్ బి) ఫారడ్, ఫారడ్
సి) హెన్రీ, హెన్రీ డి) ఫారడ్ హెన్రీ
14. ఒక తీగచుట్ట నుంచి నిలువుగా వదలిన దండయస్కాంతం తీగచుట్టలో నుంచి కిందికి పడుతోంది. దాని త్వరణం?
ఎ) g కంటే ఎక్కువ బి) g కంటే తక్కువ
సి) g కి సమానం డి) పైవేవీ కావు
15. ఫాస్పర్ - బ్రాంజ్ ధర్మం?
ఎ) యంగ్ గుణకం ఎక్కువ, ధృఢతా గుణకం తక్కువ
బి) యంగ్ గుణకం తక్కువ, ధృఢతా గుణకం ఎక్కువ
సి) యంగ్ గుణకం ఎక్కువ, ధృఢతా గుణకం ఎక్కువ
డి) యంగ్ గుణకం తక్కువ, ధృఢతా గుణకం తక్కువ
16. ఫ్యూజ్ వైర్ ముఖ్య ధర్మాలు
ఎ) తక్కువ నిరోధం, తక్కువ ద్రవీభవన స్థానం
బి) ఎక్కువ నిరోధం, తక్కువ ద్రవీభవన స్థానం
సి) తక్కువ నిరోధం, తక్కువ ద్రవీభవన స్థానం
డి) ఎక్కువ నిరోధం, ఎక్కువ ద్రవీభవన స్థానం
17. 'గాస్' కు సమానమైన విలువ?
ఎ) 10^{4} T బి) 10^{3} T సి) 10^{2} T డి) 10T
18. రెండు ఎలక్ట్రానిక్ పుంజాలు సమాంతరంగా ఒకే దిశలో ఉన్నాయి. అవి
ఎ) వికర్షించుకొంటాయి బి) ఆకర్షించుకొంటాయి
సి) వాటి వేగాలు తగ్గుతాయి
డి) ఎటువంటి అన్యోన్య ప్రభావం ఉండదు
19. అయస్కాంత అభివాహంలో మార్పు ఆగిపోయినపుడు ప్రేరిత విద్యుచ్ఛాలక బలం?
ఎ) తగ్గుతుంది బి) స్థిరం
సి) శూన్యం డి) పెరుగుతుంది
20. సమాంతరంగా షంట్ నిరోధాన్ని కలిపిన గాల్వనోమీటర్‌ను వలయంలో శ్రేణిలో కలిపితే ఆ అమరిక పేరు?
ఎ) వోల్టుమీటరు బి) అమ్మీటరు
సి) మల్టిమీటరు డి) ఓం మీటరు
21. B, H, I ల సంబంధం?
ఎ) $B = u_0H$
బి) $B = u_0 (H + I)$
సి) $B = u_0 I + H$ డి) $B = uH$
22. కండెన్సర్ పలకల మధ్య నిరోధకాన్ని ఉంచితే స్థితి శక్తి?
ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
సి) మారదు డి) మారుతుంది.
23. ఒక కండెన్సర్‌లో నిలువ ఉండే శక్తి?
ఎ) QV బి) QC / 2 సి) QV/2 డి) 1/2 CV/2
24. సబ్బు బుడగను ఆవేశ పరిస్తే?
ఎ) వ్యాకోచిస్తుంది బి) సంకోచిస్తుంది
సి) పేలిపోతుంది
డి) ఎటువంటి మార్పునకు లోను కాదు



శీలం దేవేందర్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

పోటీ పరీక్షల ప్రత్యేకం - ఫిజిక్స్



25. ఎలక్ట్రాన్ల శక్తిని పెంచాలి అంటే వాటిని -------
ఎ) బాగా ఎత్తునుంచి కిందికి పడవేయాలి
బి) సీసం దిమ్మె ద్వారా పంపాలి
సి) విద్యుత్ పొటెన్షియల్ ద్వారా ప్రయాణం చేయించాలి
డి) అధికంగా వేడిచేయాలి.
26. ఒక వస్తువు ఆవేశానికి, పొటెన్షియల్‌కు గల నిష్పత్తి?
ఎ) వాహకత్వం బి) కెపాసిటెన్స్
సి) ప్రేరకత్వం డి) నిరోధం
27. ఒక సర్పిలాకారపు స్ప్రింగ్ ద్వారా ఏకముఖ విద్యుత్ ప్రవాహాన్ని పంపారు. ఆ స్ప్రింగ్ -----
ఎ) సాగుతుంది బి) గుండ్రంగా తిరుగుతుంది
సి) సంకోచిస్తుంది డి) ఏదీకాదు
28. 100 w, 200V బల్బు నిరోధం ------
ఎ) 200 Ω బి) 100Ω సి) 150Ω డి) 400Ω
29. మానవుని నిరోధం సుమారు -------
ఎ) 10^{2} Ω బి) 10^{4} Ω సి) 10^{5} Ω డి) 10^{6} Ω
30. ఒక అర్ధ వాహకం ఉష్ణోగ్రతను పెంచినపుడు దాని నిరోధం
ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
సి) మారదు డి) పైవేవీ కాదు
31. 3Ω నిరోధం గల తీగను మూడు సమాన భాగాలుగా కత్తిరించారు. ఆ తరవాత ఈ మూడు భాగాలను వాటి చివరలు కలిసేటట్లు ముడిపెట్టారు. ఈ అనుసంధాన నిరోధం?
ఎ) 3 Ω బి) 1/3 Ω సి) 2/3 Ω డి) 1Ω
32. శక్మాంతరాన్ని ------తో కొలుస్తారు?
ఎ) అమ్మీటర్ బి) గాల్వనా మీటర్
సి) ఓల్టు మీటర్ డి) కెపాసిటర్
33. మేఘాలలోకి గాలి పటాలను ఎగురవేసి అవి విద్యుదావేశంతో ఉంటాయని నిరూపించిన శాస్త్రవేత్త--------
ఎ) ఆంపియర్ బి) ఆయిర్‌స్టెడ్
సి) ఫ్లెమింగ్ డి) ఫ్రాంక్లిన్
34. రేడియో, టార్చిలైట్, టేపు రికార్డర్లలో ఉపయోగించే ప్రాథమిక ఘటం?
ఎ) వోల్టా ఘటం బి) అనార్ద్ర ఘటం
సి) లెక్లాంచి ఘటం డి) బైక్రోమేట్ ఘటం
35. టెలిగ్రాఫ్‌ల్లో ఉపయోగించే కోడ్?
ఎ) పిన్ బి) BCD సి) మోర్స్ డి) టెలి
36. ఎలక్ట్రిక్ బల్బుల్లో నింపే వాయువు?
ఎ) హైడ్రోజన్ బి) ఆర్గాన్
సి) ఆక్సిజన్ డి) నైట్రోజన్
37. కరెంట్ ప్రయాణించడానికి అది ఏ మార్గాన్ని ఎంచుకొంటుంది?
ఎ) గరిష్ఠ నిరోధం బి) మధ్యస్థ
సి) కనిష్ఠ నిరోధం డి) పైవేవీ కాదు
38. షార్ట్ సర్క్యూట్ అయినపుడు వలయంలో కరెంట్?
ఎ) పెరుగుతుంది బి) స్థిరంగా ఉంటుంది
సి) తగ్గుతుంది డి) చెప్పలేం
39. విశిష్ట నిరోధానికి ప్రమాణం?
ఎ) ఓం/ మీటర్ బి) మో/ మీటర్
సి) ఓం మీటర్ డి) మీటర్ / మో
40. బల్బులోని ఫిలమెంటును దేనితో తయారు చేస్తారు?
ఎ) నిక్రోం బి) టంగ్‌స్టన్
సి) మాంగనీస్ డి) క్రోమియం
41. విద్యుత్ప్రవాహం వల్ల ఉష్ణ ఫలిత అనువర్తనం?
ఎ) విద్యుత్ - ఇస్త్రీ పెట్టె బి) ఇమ్మర్షన్ హీటర్
సి) ఎలక్ట్రిక్ స్టౌ డి) పైవన్నీ
42. విద్యుత్ పని w, కరెంట్ i, నిరోధం R, కాలం t ల మధ్య సంబంధం?
ఎ) w = iRt బి) $w = i^2 R/t$
సి) $w = i^2Rt$ డి) $w = i^2t/R$
43. ఒక విద్యుత్ సాధనం వాటేజ్(P)ను తెలిపే సమీకరణం?
ఎ) p = vi బి) $p = v^2/R$
సి) $p = i^2R$ డి) పైవన్నీ
44. ఇళ్లలోకి సరఫరా చేసే విద్యుత్ పొటెన్షియల్ భేదం?
ఎ) 220v బి) 130v సి) 240v డి) 180v
45. నిత్య జీవితంలో విద్యుత్ శక్తిని కొలిచేందుకు ఉపయోగించే పెద్ద ప్రమాణం
ఎ) వాట్ - గంట బి) కిలోవాట్ - గంట
సి) వాట్ - సెకను డి) జౌల్ / సెకను
46. విద్యుత్ ప్రవాహం వల్ల ఉత్పత్తి అయ్యే ఉష్ణరాశిని కొలిచే సూత్రం?
ఎ) Q = mst బి) Q = ms/t
సి) Q = m/st డి) Q = ms
47. విద్యుత్ రసాయన తుల్యాంకానికి ప్రమాణాలు?
ఎ) గ్రామ్/ కూలూమ్ బి) గ్రామ్ కూలూమ్
సి) కూలూమ్/ గ్రాం డి) గ్రామ్ / ఆంపియర్
48. విద్యుద్విశ్లేషణం వల్ల కాపర్ సల్ఫేట్ ద్రావణం గాఢత-----
ఎ) పెరుగుతుంది బి) మారదు సి) తగ్గుతుంది
డి) పెరిగి తగ్గుతుంది
49. విద్యుత్ప్రవాహం వల్ల ఏదైనా బిందువు వద్ద ఏర్పడిన అయస్కాంత క్షేత్ర (B) దిశ ఆ బిందువు వద్ద గీసిన ------- దిశలో ఉంటుంది.
ఎ) అభిలంబ రేఖ బి) సరళరేఖ
సి) స్పర్శ రేఖ డి) ఏదీకాదు
50. ప్రాంతీయ ట్రాన్స్‌ఫార్మర్లు------
ఎ) స్టెప్ అప్ ట్రాన్స్‌ఫార్మర్
బి) స్టెప్ డౌన్ ట్రాన్స్‌ఫార్మర్
సి) స్టెప్ అప్, స్టెప్ డౌన్ ట్రాన్స్‌ఫార్మర్
డి) ఏదీ కాదు

సమాధానాలు

1) బి	9) సి	17) ఎ	25) సి	34) బి	43) డి
2) సి	10) డి	18) బి	26) బి	35) సి	44) సి
3) బి	11) బి	19) సి	27) సి	36) బి	45) బి
4) ఎ	12) డి	20) బి	28) డి	37) సి	46) ఎ
5) డి	13) సి	21) బి	29) సి	38) ఎ	47) ఎ
6) బి	14) బి	22) బి	30) బి	39) సి	48) బి
7) బి	15) ఎ	23) ఎ	31) బి	40) బి	49) సి
8) ఎ	16) బి	24) ఎ	32) సి	41) డి	50) బి
			33) డి	42) సి	

ఉద్యోగాలు

డిఎంఇ

ఆంధ్రప్రదేశ్‌లోని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) - **అసిస్టెంట్ ప్రొఫెసర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 198
విభాగాలు: అనాటమీ/ ఫిజియాలజీ/ ఫార్మకాలజీ/ మైక్రోబయాలజీ/ ఎమర్జెన్సీ మెడిసిన్/ ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్
అర్హత: (ఎమ్మెస్/ ఎండి)(అనాటమి)/ఎంబిబిఎస్ + ఎమ్మెస్సీ (మెడికల్ అనాటమీ) + పిహెచ్‌డి(మెడికల్ అనాటమీ)/ (ఎమ్మెస్సీ + డిఎస్సీ)(మెడికల్ అనాటమీ)/ ఎండి(ఫిజియాలజీ)/ ఎంబిబిఎస్ + ఎమ్మెస్సీ (ఫిజియాలజీ)/ (ఎమ్మెస్సీ+ పిహెచ్‌డి)(మెడికల్ ఫిజియాలజీ)/ ఎండి(బయోటెక్నాలజీ/ మైక్రో బయాలజీ/ ఎంబిబిఎస్ + ఎమ్మెస్సీ(బ్యాక్టీరియాలజీ/ మెడికల్ బ్యాక్టీరియాలజీ) + పిహెచ్‌డి(మెడికల్ బ్యాక్టీరియాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: జూలై 1 నాటికి 40 ఏళ్లు మించరాదు
ఎంపిక: అకడమిక్ మెరిట్ లిస్ట్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.1000
ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని నింపి రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా కానీ పర్సనల్‌గా గానీ కింది చిరునామాకు పంపుకోవాలి.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 4
చిరునామా: Director of Medical Education, AP, Vijayawada
వెబ్‌సైట్: www.dme.ap.nic.in

అడ్మిషన్స్

టాటా మెమోరియల్ హాస్పిటల్

టాటా మెమోరియల్ హాస్పిటల్ - కేన్సర్ పేషెంట్లకు క్లినికల్ కేర్ & సైకో సోషల్ కేర్ అందించేందుకు ఉద్దేశించిన **'పేషెంట్ నేవిగేటర్ సర్టిఫికెట్ కోర్స్'**కు దరఖాస్తులు కోరుతోంది.
కోర్సు కాల వ్యవధి: ఆరునెలలు
కోర్సు ఫీజు: రూ.18,000
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 25
వెబ్‌సైట్: https://tmc.gov.in

యూనివర్సిటీ ఆఫ్ లక్నో

యూనివర్సిటీ ఆఫ్ లక్నో - **ఎంబిఏ** కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది
కోర్సు విభాగాలు: ఫైనాన్స్ & కంట్రోల్/ హెచ్‌ఆర్& ఐఆర్/ ఇంటర్నేషనల్ బిజినెస్/ మార్కెటింగ్
అర్హత: 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణ.
ఎంపిక: క్యాట్ 2017 స్కోరు ద్వారా
ఆసక్తిగల అభ్యర్థులు ముందుగా క్యాట్ 2017కు దరఖాస్తు చేసుకొని ఆ తరవాత లక్నో యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకోవాలి.
క్యాట్ రిజిస్ట్రేషన్: సెప్టెంబరు 20 వరకు
క్యాట్ 2017 ఎగ్జామ్: నవంబరు 26
యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరు తేదీ: 2018 జనవరి 31
వెబ్‌సైట్: www.lkouniv.ac.in

ఐఐటిబి - మోనాష్

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటిబి), ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లోని మోనాష్ యూనివర్సిటీ ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'ఐఐటిబి - మోనాష్ రీసెర్చ్ అకాడమీ - **పిహెచ్‌డి ప్రోగ్రామ్**‌నకు దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: సైన్స్/ టెక్నాలజీ/ కంప్యూటర్ సైన్స్/ ఐటి/ ఇంజనీరింగ్/ హ్యూమానిటీస్/ సోషల్ సైన్సెస్/ డిజైన్ / మేథమెటిక్స్
అర్హత: ఫస్టు క్లాస్ మార్కులతో పీజీ/ బిఎస్సీ/ బిఇ/ బిటెక్ పూర్తిచేసి ఉండాలి. గేట్/ జిఆర్‌ఇ/ సిఎస్‌ఐఆర్- నెట్ / జామ్ ఎగ్జామ్స్‌లో అర్హత పొందినవారికి ప్రాధాన్యం ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 11
వెబ్‌సైట్: www.iitbmonash.org

టంగ్ ట్విస్టర్స్

1. Farrell's features fablous food 'n' fantastic fountain fantasies for frolicking, fun-filled festive families.
2. Thomas Tattamus took two T's to tie two tots to two tall trees.
3. The Final Fixing of the Foolish Fugitive

సూక్తి

మానవుడు ఎంత గొప్పవాడు అయితే.. అంత కఠినమైన పరీక్షలు దాటవలసి ఉంటుంది.

నవ్వుల్ నవ్వుల్

సాంబా : వాస్తు తెలిసిన డాక్టరు దగ్గరకు వెళ్లడం తప్పైపోయింది.
లింగం : ఏమన్నాడేంటి?
సాంబా : వాస్తు బాగాలేదు. గుండె వేరే ప్రదేశానికి మార్చమంటున్నాడు.
లింగం : !!!!!!!!

ముళ్లతో ఉండే గులాబీలు ఎవరికి ఏ హానీ చేయవు.. బురదలో పుట్టే కమలం సుగంధ పరిమళాల్నే వెదజల్లుతుంది. కానీ విషపూరితమైన పువ్వులను, చెట్లను చూశారా? ఆ చెట్లను ముట్టుకున్నా, వాటి గాలి పీల్చినా ప్రాణాలు పోవాల్సిందే. అలాంటి విష పూరిత చెట్లతో ఇంగ్లాండ్‌లో 'పాయిజన్' అనే ఓ పూదోట ఉంది. ఆ విశేషాలు..



పాయిజన్ ప్లాంట్స్

పాయిజన్ గార్డెన్‌లోని రకరకాల రంగు రంగుల పూలు ఇంగ్లాండ్ వాసుల్ని రారమ్మని స్వాగతం పలుకుతాయి. కానీ ఆ పూదోట గేటుపై 'ఈ చెట్లు మిమ్మల్ని చంపేస్తాయి' అని రాసుంటుంది. అంతేకాదు గేటు దాటి లోపలికి అడుగు పెట్టగానే 'ఈ పూలను తుంచకూడదు, ముట్టుకోకూడదు, ఇక్కడి గాలి కూడా పీల్చకూడదు. పిల్లలు ఈ చెట్లకు వీలైనంత దూరంగా ఉండాలి' అంటూ పుర్రె గుర్తుతో ఉన్న ఓ బోర్డు ' డేంజర్ ' అంటూ మిమ్మల్ని హెచ్చరిస్తుంది. ఈ పాయిజన్ గార్డెన్‌లో అనేక ఆకర్షణలున్నాయి. ట్రీ హౌస్,



అందమైన ఫౌంటెయిన్లు, గులాబీ, టొపీరియ పూల వనాలు అందరిని ఆకట్టుకుంటాయి. పూదోట మధ్యలో ఉండే వాటర్ కాస్కేడ్ మరో ప్రధాన ఆకర్షణ. ప్రతి సంవత్సరం వేలాది మంది సందర్శకులు ఈ పూదోటను చూడటానికి వస్తుంటారు.

మొక్కలయందు విషపు మొక్కలు వేరు..

దాదాపు 100 విషపూరిత మొక్కలు ఈ పూదోటలో ఉన్నాయి. ఈ మొక్కలున్న చోట ప్రమాద హెచ్చరిక బోర్డుతో పాటు వాటి చుట్టూ కంచె ఉంటుంది. వీటి గురించి వివరాలు తెలపడానికి గైడ్లు ఉంటారు. ఈ విషపూరిత మొక్కలపై పరిశోధనలు కూడా చేస్తుంటారు. వీటిని మెడిసిన్ తయారీలో ఉపయోగిస్తారు. ఈ విషపూరిత మొక్కల గురించి తెలియజేసే పుస్తకాలు ఈ పూదోటలోని బుక్ షాప్‌లో లభిస్తాయి.

ప్రకృతిలో నడక

పూదోటలో వుడ్‌ల్యాండ్ వాక్ బాగుంటుంది. అందమైన ప్రకృతి సాక్షిగా వేవేల వర్ణాల పువ్వుల మధ్యలో వెళ్లడం ఓ మధురానుభూతి. ఈ దారిలోనే ట్రీ హౌస్ ఉంటుంది. ఇది సందర్శకులను ప్రధానంగా ఆకర్షిస్తుంది. చెట్లపై ఉండే ఈ ట్రీహౌస్‌లో ఓ రెస్టారెంట్ ఉంటుంది. చవులూరించే స్థానిక ఆహార పదార్థాలెన్నో ఉంటాయి.





పువ్వుల్లో దాగున్న...

అక్విల్జియా : ఈ మొక్క వేర్లు, విత్తనాలు చాలా విషపూరితమైనవి.

అట్రోపా బెల్లడోన : ఈ మొక్క మరింత విషపూరితమైనది. ఇది చాలా ప్రమాదకరమైన మొక్క. దీని వాసన పీల్చడం వల్ల శ్వాసలో ఇబ్బందులు వస్తాయి. అంతేకాదు హృదయం వేగంగా కొట్టుకుంటుంది.

బ్రగ్స్‌మాన్సియా, డిజిటాలిస్, రిసినస్ కొమ్యునిస్, నక్స్ వొమిక, హెమ్‌లాక్ వంటి మొక్కలు కూడా ప్రమాదకరమైనవే.


పదాలు కనుక్కోండి

w	f	a	k	o	i	x	h	p	k
a	i	b	r	e	l	l	i	m	f
r	z	s	p	i	n	n	i	n	g
t	r	i	c	k	d	l	o	g	q
s	k	s	d	f	p	o	t	k	h

gold
straw
miller
trick
spinning



బొమ్మ గీయండి



జంతర్‌మంతర్

1. సఆక్తి ▶ ....
2. డిరాబ ▶ ....
3. వియంష ▶ ....
4. క్కువెవ ▶ ....


జంబ్లింగ్ వర్డ్స్

1. HNTU ▶ ....
2. MBOB ▶ ....
3. WODO ▶ ....
4. DETI ▶ ....


రంగులు వేయండి



దారి కనుక్కోండి



ఔనా!



వాహనాలకు సరైన పార్కింగ్ దొరకాలని అమెరికాలో 7 శాతం మంది ప్రార్థన చేస్తారు.


చెప్పగలరా?

విరిలో ఉన్నా
కానీ పురిలో లేను
లుప్తంలో ఉన్నా
కానీ గుప్తంలో లేను
వరిలో ఉన్నా
కానీ గిరిలో లేను
అయితే ఇంతకీ
నేనెవర్నో చెప్పగలరా?

జవాబులు

చెప్పగలరా? : విలువ
జంతర్‌మంతర్
1. ఆసక్తి 2. రాబడి
3. విషయం 4. ఎక్కువ
జంబ్లింగ్ వర్డ్స్ :
1.HUNT 2.BOMB
3.WOOD 4.TIDE

మీకు తెలుసా?



తేనె తిన్న తర్వాత కేవలం 20 నిమిషాల్లోనే రక్తంలో కలిసిపోతుంది.

ఆలిండియా క్రికెట్ టోర్నమెంట్‌కు

ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరి ఎంపిక

సంగారెడ్డి అర్బన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఆలిండియా మొయిన్ ఉద్ దౌలా క్రికెట్ టోర్నమెంట్‌కు ఉమ్మడి జిల్లా నుంచి పవన్‌కుమార్, మధు ఎంపికైనట్లు సెక్రటరీ రాజేందర్‌రెడ్డి తెలిపారు. టోర్నమెంట్‌లో ఆలిండియా స్థాయిలో 10 జట్లు పాల్గొంటాయని తెలిపారు. ఆలిండియా క్రికెట్ టోర్నమెంట్‌కు జిల్లా నుంచి ఇద్దరు ఎంపిక కావడంపై కోచ్ శ్రీనాథ్‌రెడ్డి సంతోషం వ్యక్తంచేశారు.


పవన్‌కుమార్


మధు

గుర్తుతెలియని

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పుల్‌కల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. సంగారెడ్డి పట్టణంలోని మాధవనగర్‌కు చెందిన దర్జి గంగాధర్ (35) రాత్రి ఫసల్‌వాది నుంచి శివ్వంటపేకు కాలినడకన వెళ్తుండగా వెనుకవైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంగాధర్ అక్కడికక్కడే మృతిచెందారు. తలపై నుంచి వాహనం టైర్లు వెళ్లడంతో ముఖభాగం చిద్రమైంది. గంగాధర్ భార్య అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్ఐ రాములు తెలిపారు.

ఆందోళన వద్దు.. మేమున్నాం

• సమస్యలను పరిష్కరిస్తాం • దరఖాస్తుదారులకు కలెక్టర్ మాణిక్కరాజ్ కన్నన్ హామీ
• ప్రజావాణికి భారీగా తరలివచ్చిన అర్జీదారులు • కిక్కిరిసిన కలెక్టరేట్



బాధితుల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ మాణిక్కరాజ్ కన్నన్

సంగారెడ్డి రూరల్ : 'బాధితులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మీ సమస్యలను పరిష్కరించేందుకు మేమున్నాం' అని బాధితులకు కలెక్టర్ మాణిక్కరాజ్ కన్నన్ హామీ ఇచ్చారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారమూ నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రెండు వారాలుగా అధికారులు నిర్వహించలేదు. ఈ వారం ప్రజావాణికి బాధితులు భారీగా తరలిరావడంతో కలెక్టరేట్ ప్రాంగణం కిక్కిరిసింది. తమకు న్యాయం చేయాలని కోరుతూ రైతు వెంకట చలపతిరావు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ స్పందించి చావుతో సమస్యలు పరిష్కారం కావని, ముందుగా ఆసుపత్రికి తీసుకెళ్లాలని బాధితుడి బంధువులకు సూచించారు.

ఇద్దరు కూతుళ్లకు వివాహం చేసినా ఇంత వరకు కల్యాణలక్ష్మి డబ్బు అందలేదని వట్‌పల్లి మండలం దేవనూర్ గ్రామానికి చెందిన బస్వరాజ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తన పెద్ద కూతురికి 2016 డిసెంబర్‌లో, చిన్నకూతురికి 2017 ఫిబ్రవరిలో పెళ్లి చేశానని కానీ కల్యాణలక్ష్మి పథకం డబ్బు రాలేదని, డబ్బు ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నారు.

ఇందిరమ్మ ప్రభుత్వంలో దళితులకు భూమి పంచారని వాటిని గ్రామ సర్పంచ్ పాలకులు దున్ని అన్యాయం చేశారని, ఈ విషయాన్ని గతంలో అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామానికి చెందిన దళితులు అంతయ్య, రామయ్య, ఎల్లయ్యలు ఫిర్యాదు చేశారు.

తనకు వచ్చే వికలాంగ పింఛన్ 2015లో నిలిపివేశారని, న్యాయం చేయాలని కొండాపూర్ మండలం గంగారం గ్రామానికి చెందిన జయపాల్ అర్జీ పెట్టుకున్నారు.

గేదెలు కొనేందుకు రుణం ఇప్పించాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన చంద్రయ్య, ప్రమీల, సరస్వతీ విన్నవించారు.

తమ భూమిలో 400 హైటెన్షన్ విద్యుత్ టవర్లు ఏర్పాటు చేసి నామమాత్రంగా పరిహారం చెల్లించారని సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామానికి చెందిన రాంబాబు ఫిర్యాదు చేశాడు.

తాను డిగ్రీ పూర్తి చేశానని తనకు వికలాంగ బ్యాక్‌లాగ్‌లో ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని నారాయణ్‌ఖేడ్ మండలం అబ్బెంద గ్రామానికి చెందిన శివలాల్ అర్జీ పెట్టుకున్నాడు.



మినుములు, పెసర్లు పంటలకు నకిలీ విత్తనాలు సరఫరా చేయడం వల్ల తమ పంట పూర్తిగా నష్టపోయామని సదాశివపేట మండలం మాచిరెడ్డిపల్లికి చెందిన ఎండీ జలీల్, అన్వర్ అలీలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఫ్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.

పశుసంవర్ధక శాఖలో సంచార వాహనాలు నడిపిన తమకు ఏడు నెలల బిల్లులు రావాలని జహీరాబాద్‌కు చెందిన కుమార్, దామోదర్ కలెక్టర్‌కు విన్నవించారు.

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా డీఆర్‌డీఏలో గురుకుల కోచింగ్ సెంటర్‌లో కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్‌లుగా 45 రోజులు పనిచేశామని, తమకు వేతనం ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వేతనాలు ఇప్పించి ఆదుకోవాలని సాయికిరణ్, సతీష్‌కుమార్ దీనంగా వేడుకుంటున్నారు.

అంత్యోదయ కార్డు ద్వారా ఉచితంగా బియ్యం ఇవ్వడం లేదంటూ కోహీర్ మండలం గుర్జువాడకు చెందిన దివ్యాంగురాలు కలెక్టర్‌కు విన్నవించింది. రెండు కాళ్లు చచ్చుబడిన దివ్యాంగురాలు బి.రాణికి తండ్రి లేరు. ముగ్గురు అక్కలు పెళ్లిళ్లయి వెళ్లిపోయారు. అన్నకు పెళ్లి కావడంతో అతను తన సంసారం చూసుకుంటున్నారు. తన బతుకు ఆగమెందని రాణి ఆవేదన వ్యక్తం చేసింది.

తమకు గత 40 ఏళ్ల క్రితం ఇచ్చిన భూములను ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి స్వాధీనం చేసుకుంటున్నామని అధికారులు చెప్పారని, తమకు జీవనాధారమైన భూమిని తీసుకుంటే ఎలా బతకాలని, న్యాయం చేసి తమ భూములు ఇప్పించాలని సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామానికి చెందిన వెంకటచలపతి, రాధాబాయిలు కలెక్టర్ మాణిక్కరాజ్ కన్నన్‌కు వినతి పత్రం అందజేశారు. వీరిలో వెంకటచలపతిరావ్ తామకు న్యాయం చేయాలని పురుగుల మందు తాగి వచ్చానని తెలపడంతో మీకు న్యాయం చేస్తామని వెంటనే బాధితుడిని ఆపుపత్రికి తరలించాలని కలెక్టర్ సూచించారు.



భర్త వేధింపుల నుంచి కాపాడండి

• ఎస్పీ గ్రీవెన్స్‌లో బాధితురాలు ఫిర్యాదు

సంగారెడ్డి రూరల్ : తనను 15 సంవత్సరాల క్రితం వివాహం చేసుకుని అదనపు కట్నం కోసం కొంత కాలంగా శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న తన భర్త నుంచి కాపాడి న్యాయం చేయాలని సదాశివపేట మండలానికి చెందిన ఓ బాధితురాలు ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి పలువురు బాధితులను ఫిర్యాదులను స్వీకరించారు.

తనకు ఏడాది క్రితం వివాహం జరిగిందని పెళ్లయిన కొత్తలో బాగానే చూసుకున్న తన భర్త అదనపు కట్నం తీసుకువస్తేనే పుట్టింటికి వెళ్లాలని భర్తతో పాటు అత్తమామలు వేధిస్తున్నారని పటాన్‌చెరు మండలానికి చెందిన ఓ బాధితురాలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. గతంలో ఈ విషయమై పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించినా తన భర్తలో మార్పు రాలేదని తన భర్తకు కౌన్సిలింగ్ ఇచ్చి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు. వీరితో పాటు మరికొందరు తమ సమస్యలు పరిష్కరించాలని ఫిర్యాదు చేశారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వారి సమస్యలు పరిష్కరించేందుకు సంబంధిత అధికారులను ఆదేశించారు.

డయల్ యువర్ ఎస్పీలో ఫిర్యాదులు

సంగారెడ్డిలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి నిర్వహించారు. ఇందులో జిల్లా నలుమూలల నుంచి బాధితులు స్వయంగా ఎస్పీకి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. బాధితుల నుంచి ఫోన్‌లో ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు

'బిలాల్‌పూర్ పోలీస్‌స్టేషన్' షూటింగ్ సందడి



మౌలానా మోహిజుద్దీన్ దర్గా వద్ద చిత్రీకరిస్తున్న సన్నివేశాలు

కోహీర్ : ఎంఎస్ క్రియేషన్ బ్యానర్‌పై నూతన నటీనటులతో నిర్మిస్తున్న బిలాల్‌పూర్ పోలీస్‌స్టేషన్ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకునట్లు చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు. సోమవారం ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన పలు సన్నివేశాలను మండల కేంద్రమైన కోహీర్‌లోని మౌలానా మోహిజుద్దీన్ దర్గా వద్ద దుండగులను పోలీసులు పట్టుకునే సన్నివేశాలను, అలాగే రైల్వే గేటు వద్ద డ్రోన్ కెమెరాతో ఓ సన్నివేశాన్ని చిత్రీకరించారు. నాగసాయి దర్శకత్వంలో మాగంటి శ్రీనాథ్, మేఘనా హీరోయిన్‌గా శ్రీనివాస్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నవంబర్ చివరి వారంలో సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపారు.



సినిమా యూనిట్ బృందం

వీధి దీపాలు వెలగడం లేదు

• డయల్ యువర్ కమిషనర్‌లో ఫిర్యాదులు



డయల్ యువర్ కమిషనర్‌లో సమస్యలు వింటున్న మున్సిపల్ డీఈ హన్మంత్ నాయక్

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి పట్టణంలోని ఆయా వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదని పలువురు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్యన మున్సిపల్ కార్యాలయం నుంచి నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి వివిధ సమస్యలపై 15 ఫిర్యాదులు వచ్చాయి. పట్టణంలోని మాధవనగర్, శాంతినగర్, కల్వకుంట రోడ్, గణేష్ నగర్, సాయినగర్, బాలాజీ నగర్ తదితర కాలనీలలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్లు వెలగడం లేదని ఫిర్యాదు చేశారు. శాంతినగర్, మార్క్స్‌నగర్, నారాయణరెడ్డి కాలనీ, శివాజీ నగర్, అహ్మద్‌నగర్ తదితర కాలనీలలో చెత్త సేకరణ సక్రమంగా చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతున్నదని పలువురు ఫిర్యాదు చేశారు. మురికి కాల్వలు కూడా సక్రమంగా శుభ్రం చేయడం లేదని తెలిపారు. డయల్ యువర్ కమిషనర్‌కు వచ్చిన ఫిర్యాదులపై డీఈ హన్మంత్‌నాయక్ స్పందిస్తూ ఈ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ నరేశ్ పాల్గొన్నారు.

తట్టు, రుబెల్లా వ్యాక్సినేషన్‌ను పరిశీలించిన కేంద్ర బృందం

కోహీర్: నాలుగు రోజులుగా కొనసాగుతున్న తట్టు, రుబెల్లా వ్యాక్సిన్ కార్యక్రమాన్ని సోమవారం మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామంలో కేంద్ర వైద్య బృందం పరిశీలించింది. దిగ్వాల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తట్టు, రుబెల్లా టీకా పిల్లలకు ఇస్తున్న తీరును తెలుసుకున్నట్లు కేంద్ర వైద్య పరిశీలకులు జితేందర్ తెలిపారు. అన్ని గ్రామాల్లో 9 నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలందరికీ తప్పనిసరిగా ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేయాలన్నారు. మరో నాలుగు రోజుల పాటు మిగిలిపోయిన పిల్లలందరికీ వ్యాక్సిన్ వేయాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఎదురైన పైఅధికారులకు తెలియజేయాలని డాక్టర్ శ్రీధర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గాయత్రి, సోయబ్, మను, శ్రీధర్, వైద్య సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

వరి నారుమడిలో రక్తపింజర

భయాందోళనకు గురైన రైతులు

కల్హేర్ : మొన్న అంతర్గాంలో సోయా చేనులో కొండ చిలువ గుర్తించిన కొన్ని రోజులకే సోమవారం భయంకరమైన రక్తపింజర బాచేపల్లిలోని వరినారుమడిలో తిరగాడింది. గ్రామానికి చెందిన కంట్రోపల్లి రామయ్యకు చెందిన పొలంలో వరినాట్లు వేయడం కోసం నారు పీకడానికి ఆయన కుమారుడు ఇమ్మాయ్య నారు దగ్గరికి వెళ్లగా రెండున్నర నుంచి మీటర్ల పొడవున్న పింజర కదలాడుతుండడం గమనించి భయంతో పరుగు తీశాడు. సమీపంలోని వ్యవసాయ పనులు చేస్తున్న మరో రైతును పిలిచి పామును చంపి వేశాడు.



పింజర పాము



పామును చంపి చేతో పట్టుకున్న రైతు